# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 17-7-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 280 పేజీలు:6 వెల: రూ.1/-


## రోడ్డుమార్గాన వరంగల్‌కు బయల్దేరిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, జులై 16:ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ నుంచి వరంగల్‌కు రోడ్డుమార్గంలో బయల్దేరారు. వరంగల్ జిల్లా ముఖద్వారం అయినా పెంబర్తిలో సీఎం కేసీఆర్ ఆగనున్నారు. హస్త కళాఖండాలను సీఎం పరిశీలించనున్నారు. ఇవాళ రాత్రికి టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఇంట్లో బస చేస్తారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా నేతలతో కేటీఆర్ భేటీ అవుతారు. పలు అంశాలపై చర్చించనున్నారు.

ఆదివారం ఉదయం వరంగల్ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ నుంచి హెలికాప్టర్ ద్వారా గోదావరి నది పరివాహక ప్రాంతంలో వరద పరిస్థితిని కేసీఆర్ పరిశీలించనున్నారు. సీఎం కేసీఆర్ ఏరియల్ సర్వే కడెం నుంచి భద్రాచలం వరకున్న గోదావరి పరీవాహక ప్రాంతంలో కొనసాగనున్నది. ఈ సర్వేలో సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

ఈ సందర్భంగా వరద ముంపు ప్రాంతాల్లో కేసీఆర్ పర్యటించే అవకాశం ఉంది. అక్కడ జరుగుతున్న సహాయ కార్యక్రమాలను కేసీఆర్ స్వయంగా పర్యవేక్షించే అవకాశమున్నది. వరదల వల్ల ప్రజలకు జరిగిన కష్టనష్టాలను సీఎం ప్రత్యక్షంగా తెలుసుకోనున్నారు. అవసరమైన మేరకు సహాయాన్ని ప్రకటించి బాధితులకు భరోసా ఇవ్వనున్నట్లు సమాచారం.

## పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్‌కు కరోనా



హైదరాబాద్, జులై 16:రాష్ట్ర బీసీ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కరోనా బారినపడ్డారు. తేలికపాటి లక్షణాలు కనిపించడంతో పరీక్ష చేయించుకోగా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆయన ఐసోలేషన్‌లో ఉన్నారు. తేలికపాటి లక్షణాలు ఉన్నాయని, అయినా తాను ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల తనను కలిసిన వారంతా తప్పనిసరిగా కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మంత్రి గంగుల కమలాకర్ కరోనా బారినపడడం ఇది రెండోసారి. ఇంతకు ముందు గతేడాది అక్టోబర్‌లో కొవిడ్ బారినపడ్డారు.

## ముంపు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జులై 16: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులు, డాక్టర్లతో ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు ఇవాళ సమీక్ష నిర్వహించారు. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ముంపునకు గురైన గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ముంపు గ్రామాల్లో తక్షణమే హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్య సేవలందించాలని సూచించారు. డాక్టర్లు, ఇతర సిబ్బంది సెలవులు తీసుకోకుండా.. విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపుల్లో పరీక్షలు నిర్వహిస్తూ.. మెడిసిన్స్‌ను బాధితులను అందజేయాలని చెప్పారు.

ఈ మేరకు హెల్త్ డైరక్టర్ శ్రీనివాసరావును కొత్తగూడెం కేంద్రంగా, మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ రమేశ్ రెడ్డిని మంచిర్యాల కేంద్రంగా విధులు నిర్వహిస్తూ హెల్త్ క్యాంపులు తదితర ప్రజారోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని, అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## ధవళేశ్వరం వద్ద గంట గంటకూ పెరుగుతున్న వరద ఉధృతి

అమరావతి, జులై 16: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి జిల్లాలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గంట గంటకూ వరద ఉధృతి భారీగా పెరుగుతుంది. మధ్యాహ్నం బ్యారేజీ వద్ద 20.60 అడుగుల నీటిమట్టం ఉండగా ప్రస్తుతం 21.30 అడుగులకు చేరుకుంది. బ్యారేజీ నుంచి 25.08 లక్షల క్యూసెక్కుల వరద నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. వరద మరింత పెరిగితే ఆరు జిల్లాలపై ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయి.

కోనసీమలో 21, తూర్పుగోదావరిలో 9 మండలాలపై వరద ప్రభావం కనిపిస్తోంది. అల్లూరి జిల్లాలో 5, పశ్చిమగోదావరి జిల్లాలోని 4 మండలాలపై వరద ప్రభావం పడనుంది. ఏలూరులో 3, కాకినాడ జిల్లాలో 2 మండలాల కూడా ముంపు బారిన పడే అవకాశముంది. ఇప్పటివరకు 62,337 మందిని 220 పునరావాస కేంద్రాలకు తరలించారు.దీంతో గోదావరి తీర ప్రాంతాల్లోని లంక గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. చుట్టూ వరద నీరు వచ్చి చేరడంతో వారిని అధికారులు పునరావాసాలకు తరలించారు. దాదాపు కరెంట్ స్తంభం మూడింతల వరకు నీరు వచ్చి చేరడంతో అనేక ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లల్లోని సామగ్రి గోదావరి పాలైంది.

పంటలు నీట మునిగాయి. కోనసీమ జిల్లాలో తీరానికి ఆనుకుని ఉన్న వందకుపైగా లంక గ్రామాల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తమను ఆదుకునేవారు కరువయ్యారని, సర్కారు కనీసం పట్టించుకోక పోవడంతో వేలాది మంది బాధితులు హాహాకారాలు చేస్తున్నారు. ఇప్పటికే 8 మండలాల్లో లంక గ్రామాలకు అధికారుల జాడే లేదు. కుక్కునూరులో ఇంకా అనేక కుటుంబాలు నీటిలోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ సహనము తో నందరికిని
సహకారము నంద జేయు సద్గుణ మతిగా
నవరసము లను గుర్తుంచెడి
మహనీయుడు" దుక్కిపాటి మధుసూదనుడే !!

(జులై 17 నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు జయంతి..)

-రాధశ్రీ



సెల్: 9494481210

## కేంద్రం కక్షపూరిత వైఖరిపై పార్లమెంట్‌లో గళం విప్పాలి : సీఎం కేసీఆర్

హైదరాబాద్, జులై 16:తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఉభయ సభల్లో గళం విప్పాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు టీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులను ఆదేశించారు. ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణను ప్రోత్సహించడం మాని, తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ద్వేషపూరితంగా వ్యవహరించడాన్ని ఎండగట్టాలని సూచించారు.

సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎంపీలు, రాజ్యసభ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సి వ్యూహంపై సీఎం కేసీఆర్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఏర్పడిన ఎనిమిదేళ్ల కాలంలో రాష్ట్ర విభజన హామీలు సహా పలు హక్కులను తొక్కిపడుతున్న బీజేపీ అసంబద్ధ వైఖరిని, కలిసొచ్చే విపక్ష ఎంపీలతో సమన్వయం చేసుకొని ఎండగట్టేందుకు కార్యాచరణపై ఎంపీలతో సీఎం చర్చించారు.

### తెలంగాణ బిడ్డలుగా బీజేపీ ప్రభుత్వంపై పోరాడాలి

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి నిలిచిపోతున్న నేపథ్యంలో, సోయి ఉన్న తెలంగాణ బిడ్డలుగా, భారత పౌరులుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు పార్లమెంట్ ఉభయ సభలనే సరైన వేదికలుగా మలుచుకోవాలని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి చెందుతున్న తెలంగాణను మోడీ ప్రభుత్వం ఏనాడూ ప్రోత్సహించకపోగా, అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడుతున్నదని సీఎం కేసీఆర్ దుయ్యబ ట్టారు.

దేశంలోని 22 రాష్ట్రాల అప్పులు తెలంగాణకంటే ఎక్కువగా ఉన్నాయని, కానీ, పరిధికి లోబడే తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాలు నడుపుతున్న తీరును ఎంపీలకు ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్ల కాలంలో ఒక్క రోజు కూడా, ఒక్క పైసా కూడా డిఫాల్ట్ కాకుండా తిరిగి చెల్లించిన ట్రాక్ రికార్డు తెలంగాణ సొంతమని సీఎం తెలిపారు. ఆర్‌బీఐ వేసే బిడ్లలో తెలంగాణకే ఎక్కువ డిమాండ్ పలుకుతున్న విషయం వాస్తవం కాదా? అని ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రాన్ని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు.

### తెలంగాణ మోదీకి కన్నుకుట్టింది..

పాలనలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్న తెలంగాణ మీద ప్రధాని మోడీకి కన్నుకుట్టిందని సీఎం కేసీఆర్ ఆరోపించారు. నిబంధనల పేరుతో ఆర్థికంగా తెలంగాణను అణచివేయాలని చూడటం అత్యంత శోచనీయమన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకునే నిర్ణయాలు బీజేపీ సోషల్ మీడియా గ్రూప్‌లకు ఎట్లా చేరుతున్నాయో.. బీజేపీ నాయకత్వం స్పష్టం చేయాలని అన్నారు. దేశానికి, రాష్ట్రాలకు నడుమ గోప్యంగా ఉండాల్సిన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా లీక్ చేసి, తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం.. నేరపూరిత చర్య అని సీఎం స్పష్టం చేశారు.

ఇదంతా ఒక పకడ్బందీ పథకం ప్రకారం జరుగుతున్న బీజేపీ రాజకీయ దిగజారుడుతనమని సీఎం దుయ్యబట్టారు. తెలంగాణ పట్ల కేంద్ర బీజేపీ జాతీయ నాయకత్వం చౌకబారు రాజకీయాలను ఆశ్రయించడం దురదృష్టకరమని సీఎం అన్నారు. ప్రతిఏటా ఎఫ్ఆర్‌బీఎం లిమిట్‌ను కేంద్రం ప్రకటిస్తుందని, ఆ తర్వాతే రాష్ట్రాలు కేంద్రం ప్రకటనపై ఆధారపడి వారి వారి బడ్జెట్లను రూపొందించుకుంటాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎఫ్ఆర్‌బీఎం లిమిట్ రూ.53వేల కోట్లు అని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తర్వాత మాట మార్చడం ఏంటని ప్రశ్నించారు.

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ఆమోదం పొందిన తర్వాత అకస్మాత్తుగా, కక్షపూరితంగా రూ.53వేల కోట్ల ఎఫ్ఆర్‌బీఎం లిమిట్‌ను రూ.23వేలకోట్లకు కుదించడం కుట్ర కాదా? అని సీఎం కేసీఆర్ కేంద్రాన్ని నిలదీశారు. ఇలాంటి దివాళాకోరు, తెలివితక్కువ వ్యవహారాలపై పార్లమెంట్ ఉభయ సభల్లో బీజేపీని నిలదీస్తూ, వారి నగ్న స్వరూపాన్ని బట్టబయలు చేయాలని ఎంపీలకు సూచించారు. అందుకు అన్నిరకాల ప్రజాస్వామిక పద్ధతులను అనుసరించాలని దిశానిర్దేశం చేశారు.

విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్రం తమకు అయినవారికి అప్పనంగా దోచిపెట్టేందుకు రాష్ట్రాలమీద ఒత్తిడి తేవడంపై సీఎం కేసీఆర్ మండిపడ్డారు. దీనిపై కేంద్రాన్ని నిలదీయాలని ఎంపీలకు సూచనలు చేశారు. తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచీ ప్రతిసారీ నీతి ఆయోగ్ ప్రశంసిస్తున్నదని, అత్యుత్తమ ప్రగతిని సాధిస్తున్న రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహించాలని పలుమార్లు నీతి ఆయోగ్ వంటి సంస్థలను చేసిన సిఫారసులను ఉద్దేశపూర్వకంగా బుట్ట దాఖలు చేసిందని, దీనిపై కూడా నిలదీయాలని సీఎం చెప్పారు.

దేశంలో ఏ మూలన అభివృద్ధి సాధిస్తున్నా అది దేశ జీడీపీకే సమకూరుతుందన్నారు. దేశంలో కేవలం ఎనిమిది రాష్ట్రాలే ఎక్కువ శాతం దేశ జీడీపీకి కంట్రిబ్యూట్ చేస్తున్నాయని, అందులో తెలంగాణ ఒకటని సీఎం తెలిపారు

## అసంక్రమిత వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు: మంత్రి హరీశ్‌రావు




హైదరాబాద్, జులై 16:బీపీ, షుగర్‌లాంటి అసంక్రమిత వ్యాధుల నివారణకు తెలంగాణ సర్కారు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఐడియా క్లినిక్స్ డాక్టర్ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో సోమాజిగూడ పార్క్ హోటల్‌లో శనివారం నిర్వహించిన డయాబెటిక్, ఎండో క్రైనాలజి రీసెర్చ్ అప్డేట్ -2022 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఇలాంటి సదస్సులద్వారా ఎన్నో అనేక కొత్త విషయాలు తెలుసుకునేందుకు, ఒకరి నుంచి మరొకరు అనుభవాలు పంచుకునేందుకు మంచి అవకాశముంటుందన్నారు.

చికిత్సలో వస్తున్న నూతన మార్పులు, టెక్నాలజీలు తెలుసుకోవచ్చని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. చికిత్సా విధానంలో రోజురోజుకూ అనేక మార్పులు వస్తున్నాయని, అనేక పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఆ ఫలితాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటే ప్రజలకు అధునాతనమైన వైద్య సేవలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. మారిన జీవన శైలి, ఆహార అలవాట్లు, చెడు అలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే రోగాలు వస్తున్నాయని, బీపీ, షుగర్‌లాంటి అసంక్రమిత వ్యాధులు వస్తున్నాయన్నారు. దీన్ని నియంత్రించేలా సీఎం కేసీఆర్ ఇప్పటివరకూ ఉన్న మూడంచెల అరోగ్య వ్యవస్థను ఐదంచెల వ్యవస్థగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఐదు మెడికల్ కాలేజీలుంటే ఇప్పుడు ఆ సంఖ్యను 33 కి పెంచుకుంటున్నామని తెలిపారు.

### తెలంగాణలో ప్రతిజిల్లాకు ఒక మెడికల్ కాలేజీ

ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఉండే ఏకైక రాష్ట్రం మన తెలంగాణ కాబోతున్నదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఎంబీబీఎస్, పీజీ సీట్లను పెద్ద సంఖ్యలో పెంచుతున్నట్లు చెప్పారు. చైనా, ఉక్రెయిన్ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే వైద్య విద్య చదివేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. దేశంలో పెద్ద మొత్తంలో (అసంక్రమిత వ్యాధులు) ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఇప్పటివరకూ 1.34 కోట్ల మందికి స్క్రీనింగ్ పూర్తి చేసి, దాదాపు 6 లక్షల షుగర్ పేషెంట్లను గుర్తించామన్నారు. వారందరికీ చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు అవసరమైన మందులు అందిస్తున్నామని చెప్పారు. అవగాహన కల్పించడంతో పాటు ఎర్లీ స్క్రీనింగ్, ఎర్లీ ట్రీటింగ్ విధానాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్ నియంత్రణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని వెల్లడించారు. ప్రభుత్వమే పూర్తి ఉచితంగా మందుల కిట్స్ ఇస్తున్నదని చెప్పారు. ఏ మందులు ఎలా వేసుకోవాలో ఆ కిట్ లో స్పష్టంగా రాసి ఉంటుందని వివరించారు. మందులు ఇచ్చినా కొందరు అవగాహన లేక వాడడం లేదని, వారికి ఆశా కార్యకర్తలు కౌన్సిలింగ్ ఇచ్చి క్రమం తప్పకుండా మందులు వాడేలా చూస్తారన్నారు.

33 జిల్లాల్లో టీ డయాగ్నొస్టిక్స్ ద్వారా 57 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. 259 బస్తీ దవాఖానల ద్వారా పట్టణాల్లో ప్రజలకు వైద్యం చేరువైందన్నారు. వీటి సంఖ్యను త్వరలో 390కి పెంచుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సబ్ సెంటర్లు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నాయన్నారు. ఇలా ప్రభుత్వం అనేక రకాలుగా ఎన్‌సీడీ వ్యాధులను గుర్తించి నియంత్రించే కార్యక్రమం అమలు చేస్తున్నదని తెలిపారు. ములుగు, సిరిసిల్లలో హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టను ప్రభుత్వం ప్రారంభించిందని, త్వరలో రాష్ట్రమంతటా విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, నడకలాంటివి అలవాటు చేసుకోవాలని, బాడీ మాస్ ఇండెక్స్ పరిమితిలో ఉండేలా చూసుకోవాలన్నారు. అధిక బరువు తగ్గించుకోవాలని సూచించారు. ఏటా కొన్ని ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని, మందులు వాడాలన్నారు. జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స చేయడమే కాకుండా, రాకుండా ఉండేలా చేసే అవగాహన కార్యక్రమాలు, ఉచిత పరీక్షల నిర్వహణ క్యాంపులు ఏర్పాటు చేయాలని సదస్సు నిర్వాహకులను కోరారు.

## రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచుతున్నాం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, జులై 16:రాష్ట్ర వ్యాప్తంగా విద్యా ప్రమాణాలను పెంచుతున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. దుండిగల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వొకేషనల్ కాలేజీకి కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సురభి వాణిదేవీతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. 2013లో ఇదే కాలేజీ ఆవరణ నుంచి ఉద్యమంలో భాగంగా సకల జనుల భేరీ నిర్వహించాం. శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ ఇక్కడ్నుంచే ప్రారంభించాం. ఈ కాలేజీలో ఆ రోజు పాడుబడ్డ గోడలు, శిథిలావస్థ భవనాలు ఉండేవి. ఈనాడు ఈ కాలేజీని అద్భుతంగా తీర్చిదిద్దారు. వొకేషనల్ కాలేజీకి కూడా శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

మనకంటే మన పిల్లలు ఉన్నతస్థితిలో ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అది జరగాలంటే.. ప్రాథమిక, మాధ్యమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. గత 8 ఏండ్లలో కేసీఆర్ విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నారు. అంగన్ వాడీ విద్య నుంచి మొదలుకొంటే యూనివర్సిటీ విద్య వరకు మార్పులు తెచ్చి, విద్యా ప్రమాణాలను పెంచేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాథమిక నుంచి మాధ్యమిక విద్య వరకు 973 గురుకుల పాఠశాలలు స్థాపించాం. నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, ఇతర వసతులు కల్పిస్తున్నాం. ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. గురుకుల విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధిస్తున్నారంటే అది ప్రభుత్వ కృషి మాత్రమే అని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ నుంచి ఉన్నత విద్య వరకు రూ. 18 వేల కోట్లు ఖర్చు పెట్టి ఫీజు రియింబర్స్‌మెంట్ అందించాం. మహాత్మా జ్యోతి బాపూలే, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ కింద విదేశీ విద్య కోసం రూ. 20 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఏవియేషన్, ఆటో మొబైల్ యూనివర్సిటీలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వైపు విద్యకు, మరో వైపు ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత 65 ఏండ్లలో ఐదు మెడికల్ కాలేజీలు వస్తే.. జిల్లాకు ఒకటి చొప్పున 33 మెడికల్ కాలేజీలు మంజూరు చేశారు. విద్యా రంగంలో గతంలో జరగని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు జరుగుతున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు పూర్తి : సీఈవో




హైదరాబాద్, జులై 16: ఈ నెల 18న రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తెలంగాణ శాసనసభలో చేసిన ఏర్పాట్లను సీఈవో వికాస్ రాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ.. సోమవారం జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పష్టం చేశారు. అసెంబ్లీలోని మొదటి కమిటీ హాల్‌లో 2 ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశామన్నారు.

అసెంబ్లీలో 119 తెలంగాణ ఎమ్మెల్యేలు ఓటు వేస్తారని పేర్కొన్నారు. ఏపీ కందుకూరు ఎమ్మెల్యే మహిధర్ రెడ్డి హైదరాబాద్‌లోనే ఓటు వేస్తారని తెలిపారు. ఓటేసేందుకు ఈసీ ఇచ్చిన పెన్నునే ఎమ్మెల్యేలు వాడాలని చెప్పారు. ఇతర పెన్నులు వాడితే ఓటు చెల్లదు అని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో కొవిడ్ ప్రోటోకాల్స్ పాటించాలని వికాస్ రాజ్ సూచించారు.

## ఆషాఢ బోనాలు తెలంగాణ సంస్కృతిని తెలియజేస్తాయి: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్, జులై 16:ఆషాఢ బోనాలు తెలంగాణ సంస్కృతిని తెలియజేస్తాయని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద ఈ నెల 24 వ తేదీన జరిగే బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడారు. కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్లపాటు బోనాల పండుగను జరుపుకోలేదన్నారు. ఈ ఏడాది బోనాలను ఘనంగా నిర్వహించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 25వ తేదీన నిర్వహించే అంబారీపై అమ్మవారి ఊరేగింపు ఉత్సవం ఖర్చును తెలంగాణా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈ ఖర్చును గతంలో ఆలయ కమిటీ సభ్యులే భరించే వారని తెలిపారు.

దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద భక్తులు ఎలాంటి తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి సీవరేజ్ లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో భక్తుల కోసం 2 లక్షల వాటర్ ప్యాకెట్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మూడు వైద్య ఆరోగ్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు.

భక్తులు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ డైవర్షన్‌కు చర్యలు తీసుకోవాలని మంత్రి తలసాని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బోనాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ. 15 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. సుమారు 3,500కు పైగా దేవాలయాలకు ప్రభుత్వం బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 24వ తేదీన బోనాలు నిర్వహించే దేవాలయాలకు రెండు మూడు రోజుల్లో ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

### బోనాల పోస్టర్, సీడీని ఆవిష్కరించిన మంత్రి

సబ్జి మండి లోని శ్రీ నల్లపోచమ్మ, శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్, పాటల సీడీని ఆవిష్కరించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్వాహకులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, దర్బార్ మైసమ్మ ఆలయ చైర్మన్ అమర్‌సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీసీపీ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, వాటర్ వర్క్స్ ఈఎస్సీ కృష్ణ, జీఎం నాగేందర్, టూరిజం సీఈ రమణ, పలు శాఖలకు చెందిన ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మళ్లీ వర్షాలు.. బీ అలర్ట్ అంటున్న వాతావరణ శాఖ

హైదరాబాద్, జులై 16:కొద్దిపాటి విరామం తర్వాత హైదరాబాద్‌లో ఇవ్వాల (శనివారం) కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఎఓఅ) తెలిపింది. అయితే నగరం సాధారణం కంటే చల్లగా మారింది. సిటీలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి.. గరిష్టంగా 29.2 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 22.4 డిగ్రీల సెల్సియస్ గా ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 48 గంటలలో సిటీ మేఘావృతమై, ఉరుములతో కూడిన జల్లులతో వర్షం కురుస్తూ.. గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీల సెల్సియస్‌తో ఉండే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు.

ఇక.. తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. జూన్ 17న నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్) జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

జూన్ 18న నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్), జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

జూన్ 19న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ (రూరల్), వరంగల్ (అర్బన్), జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ అధికారులు వెల్లడించారు.

# ప్లాస్టిక్ నిషేధ నిర్ణయం సరైందే..కాని అమలు సాధ్యమేనా?.!

ప్రజారోగ్య పరిరక్షణ, సకల ప్రాణికోటి రక్షణ, దేశవాసుల సంక్షేమం, దేశ సుస్థిరాభివృద్ధి, మానవాళి సుఖ జీవనానికి బాటలు వేసే ప్లాస్టిక్ నిషేధమనే ముఖ్య నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషదాయకం. అతి ప్రమాదకర 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఒకేసారి వాడి పడేసే ప్లాస్టిక్)' వాడకాన్ని నిషేధిస్తూ భారత కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా (01 జూలై 2022 నుంచి) నిర్ణయం తీసుకోవడం బహు ఆనందకరం, సదా అభినందనీయం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించిన 100 దేశాల జాబితాలో ఇండియా 94వ స్థానంతో చేరినట్లు అయ్యింది. గతంలో కూడా ప్రభుత్వం ప్లాస్టిక్ నియంత్రణకు ప్రయత్నించడం జరిగినా ఆశించిన ఫలితాలు అమలులో కనిపించలేదు.

**ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకం:**

భూమండలానికి, జీవకోటి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిముతూ దేశంలోని 140 కోట్ల భారతీయ ప్రజల ఆయురారోగ్యాలను కాపాడుటలో ఈ నిర్ణయం ప్రముఖ పాత్రను వహిస్తుందనటంలో అతిశయోక్తి లేదు. దేశవ్యాప్తంగా మహా నగరాలు, పట్టణాలు, వీధులు, నాలాలు, పల్లెలు, నదులు, మహాసముద్రాలు నేడు గరళ ప్లాస్టిక్ అవశేషాలతో నిండిపోయి ఉండడంతో ప్రజలు, సకల జీవుల ఉనికి ప్రమాదంలో పడుతున్నది.

**నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు:**

ప్లాస్టిక్ స్ట్రాలు, థర్మకోల్, డిస్పోజబుల్ ప్లాస్టిక్, కప్స్, గ్లాసెస్, ఇయర్ బడ్స్, ఐస్‌క్రామ్ కప్స్, స్వీట్ బాక్సులు, కత్తులు, పివిసి బ్యానర్లు, ప్లేట్లు, స్ట్రాలు, ట్రేలు, స్పూన్లు, బెలూన్లకు వాడే ప్లాస్టిక్ స్టిక్స్, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ అలంకార సామాగ్రి, సిగరెట్ పెట్టెలు లాంటి 19 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగ ఉత్పత్తులను నిషేధించడం ముదావహం. నేడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను తయారు చేసినా, నిల్వ ఉంచినా, పంపిణీ చేసినా, విక్రయించినా చట్ట వ్యతిరేకం, దండనీయమని తెలుసుకోవాలి.

**గరళ ప్లాస్టిక్‌తో సహజీవనం:**

ఇండియాలో ఏడాదికి దాదాపు 14 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వినియోగం కావడం, అనంతరం కాలుష్య భూతంగా మారడం చూస్తున్నాం. వాడి పడేసిన జీవ విచ్ఛిన్నం చెందని ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా పారవేయగల యంత్రాంగం లేకపోవడంతో ప్లాస్టిక్ విష వ్యర్థాలతో మానవాళి సహజీవనం చేయాల్సిన అగత్యం ఏర్పడింది. 1950 నుంచి నేటి వరకు భారత దేశవ్యాప్తంగా 8.3 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి కావడం, దీనిలో కనీసం 60 శాతం నేల, నీటిలో నిక్షిప్తం కావడంతో ప్రాణుల మనుగడకే ముప్పు ఏర్పడింది. ఐరాస అంచనాల ప్రకారం దాదాపు 100 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాలను చేరి జలచరాలకు ప్రాణాంతకంగా మారడం చూస్తున్నాం. పలు జలచరాలు, ఇతర జంతువుల శరీరాల్లోకి మైక్రో ప్లాస్టిక్ చేరి అనారోగ్య కారణంగా మారడం వాస్తవమని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు జీవ విచ్ఛిన్నం కావడానికి కనీసం 100 ఏండ్లు అయినా పడుతుందని గమనించాలి. క్రమంగా, దశల వారీగా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసే ప్రయత్నాలు జోరందుకోవడం హర్షదాయకం. నేటి సమాజం విరివిగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగులు, బాటిల్స్ నిషేధం కూడా తీసుకురావాలని కోరుకుందాం, సహకరిద్దాం. ప్లాస్టిక్ నిషేధ నిర్ణయంతో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుతాయని ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు కుటిల విజ్ఞాపనలు చేయడం హాస్యాస్పదం, స్వార్థపూరితంగా తోస్తున్నది.

**ప్రపంచ సమస్యగా ప్లాస్టిక్ కాలుష్యం:**

అగ్నికి ఆజ్యం పోసినట్లు 2060 నాటికి 1.2 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వస్తువుల ఉత్పత్తికి శిలాజ ఇంధనాలు వాడడంతో కార్బన్ ఉద్గార సంక్షోభానికి ఊతం ఇవ్వడమే కాకుండా సాలీనా 1 బిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలకు జననానికి కారణం అవుతుందని నిపుణులు వాపోతున్నారు. ఐరాస పర్యావరణ కార్యక్రమం (యూయన్‌ఈపి - యూయన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్) అంచనా ప్రకారం నిమిషానికి ఒక మిలియన్ ప్లాస్టిక్ బాటిల్స్ అమ్ముడు పోవడంతో పాటు సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ సంచులు ప్రపంచవ్యాప్తంగా వినియోగించ బడుతున్నాయి. మె?త్తం ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో 50 శాతం ఒకేసారి వాడి నిర్దాక్షిణ్యంగా పడేయడం (సింగిల్ యూజ్) జరుగుతోందని, ప్లాస్టిక్ సమస్య ప్రపంచ సమస్యగా అవతరించడం చూస్తున్నాం. ప్లాస్టిక్ కట్టడికి ప్రపంచ దేశాలు సత్వరమే నడుం బిగించాల్సిందే. జనవరి 2022లో ఫ్రాన్స్ ప్రభుత్వం పండ్లు, కూరగాయలు, వస్తు ప్యాకింగ్‌ల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం శుభ పరిణామం, అనుసరణీయమని గమనించాలి.

**ప్లాస్టిక్ నిషేధ చట్టం అమలు:**

నేడు భారత ప్రభుత్వం తీసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని క్షేత్రస్థాయిలో కఠిన పర్యవేక్షణతో ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. భారత్‌లోని అన్ని రాష్ట్రాలు ప్రమాదకర గుట్కా ఉత్పత్తుల తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకాలను నిషేధించినా నేడు మారుమూల గ్రామాల్లో సహితం అక్రమ సప్లై చైన్ల ద్వారా గుట్కా అమ్మకాలు యద్ధేచ్ఛగా జరగడం బహిరంగ రహస్యమని మనకు తెలుసు. ప్లాస్టిక్ ఉత్పత్తి పలు దశల్లో 8000 వరకు రసాయనాలు కలుపుతారని, వీటిలో కొన్ని అత్యంత విషపూరితమని, భూతాపానికి దోహదపడతాయని గుర్తించబడింది. దేశ హితం కోరి, జీవకోటి మనుగడకు గొడుగులు పడుతూ వ్యాపారులు, ఉత్పత్తిదారులు, పంపిణీ యంత్రాంగం, వినియోగదారులు ఈ నిషేధ విజయానికి తమ తమ చేయూతల్ని అందించాల్సి ఉంది. దశాబ్దాలుగా వినియోగదారులు ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకానికి అలవాటు పడ్డారు. సామాన్య ప్రజానీకానికి ప్లాస్టిక్ గరళ ప్రభావాలను అవగాహన కల్పిస్తూ పేపర్, నూలు, స్టీల్ పాత్రల వాడకాన్ని ప్రోత్సహిస్తేనే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం సత్ఫలితాలను ఇస్తుందని గమనించాలి. అధికార యంత్రాంగాలు అలసత్వం, అధికారుల కొరత, అవినీతి చేతులు, వ్యాపారుల అక్రమ క్రియలు, రహస్య ఉత్పత్తులు/నిల్వలు, వినియోగదారుల నిర్లక్ష్యం లాంటి కారణాలతో నిషేధ అమలుకు తూట్లు పొడవరాదు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 సెక్షన్ 15 ప్రకారం ఒక లక్ష వరకు ఫైన్, 5 ఏండ్ల వరకు జైలు శిక్ష లేదా రెండు ఏకకాలంలో విధించవచ్చనే విషయాలను బహుళ ప్రచారం చేయాలి.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ అమలుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటూ, బాధ్యతగల పౌరులుగా రేపటి తరానికి ఆరోగ్యకరమైన భూగోళాన్ని, పరిశుద్ధ జల నిధులను, స్వచ్ఛమైన గాలిని ప్రకృతి ప్రసాదంగా అందిద్దాం. జీవుల నివాసానికి ఒకే భూమి ఉందని, నివాసయోగ్యతగల మరో ప్రత్యామ్నాయ గ్రహం లేదని కళ్లు తెరుద్దాం, ప్లాస్టిక్ గరళ భూతాన్ని పారద్రోలుదాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌లో సీపీపిఐబి కలిగి ఉన్న ఓటింగ్ హక్కుల నిష్పత్తి పెంపుకు ఆమోదం తెలిపిన సీసీఐ

న్యూఢిల్లీ, జులై 16: రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌లో సీపీపిఐబి కలిగి ఉన్న ఓటింగ్ హక్కుల నిష్పత్తి పెరుగుదలకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆమోదం తెలిపింది.

రెన్యూ ఎనర్జీ గ్లోబల్ లో క్లాస్ ఏ సాధారణ వాటాలు (ఓటింగ్ హక్కు కలిగిన వాటాలు)తిరిగి కొనుగోలు చేసినట్టు కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్ గ్లోబల్ పిఎల్‌సి ప్రతిపాదనను రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్రకటించడంతో ప్రతిపాదిత విలీనం అమల్లోకి వచ్చింది. రెన్యూ ఎనర్జీ గ్లోబల్ లో వాటాలను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్ గ్లోబల్ పిఎల్‌సి తిరిగి కొనుగోలు చేయడం వల్ల సంస్థలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ కలిగి ఉన్న వాటాల సంఖ్య తగ్గుతుంది. తద్వారా కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్ గ్లోబల్ పిఎల్‌సి కలిగి ఉన్న వాటాల సంఖ్య పెరుగుతుంది.

కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్‌గ్లోబల్ పిఎల్‌సి అనేది ఒక పెట్టుబడుల యాజమాన్య సంస్థ. కెనడా పెన్షన్ ప్లాన్ ఫండ్ ద్వారా అందుతున్న నిధులను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్ గ్లోబల్ పిఎల్‌సి పెట్టుబడులు పెడుతుంది. దాదాపు 21 మిలియన్ కంట్రిబ్యూటర్లు మరియు లబ్దిదారుల నుంచి అందే నిధుల్లో సీపీపీ ఫండ్ కు అవసరం లేని నిధులను కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్మెంట్ గ్లోబల్ పిఎల్‌సికి కెనడా పెన్షన్ ప్లాన్ మళ్ళిస్తుంది.

రెన్యూ, దాని అనుబంధ సంస్థలు మరియు జాయింట్ వెంచర్‌లు సంప్రదాయేతర మరియు పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వ్యాపార రంగంలో ఉన్నాయి.

## పశువులను మేపేందుకు వెళ్లి.. వాగులో గల్లంతు



వరంగల్, జులై 16: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామానికి చెందిన పుట్టి ఇన్నయ్య (55) తనకున్న పశువులను మేపడానికి ఈరోజు ఉదయం 10:30 సమయాన గ్రామ శివారులో గల పాఖాలా వాగు దగ్గరికి తీసుకెళ్లగా ఒక్కసారిగా పశువులు వాగు దాటడంతో వాటి కోసం వెళ్తున్న క్రమంలో ఇన్నయ్య వాగులో మునిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట పోలీసులు ఇన్నయ్య కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ఇన్నయ్య కు భార్య నీలిమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇన్నయ్య ఆచూకీ తెలియాల్సి ఉంది.

## మంత్రి పువ్వాడ చొరవతో భద్రాచలానికి హెలికాప్టర్

భద్రాచలం ,జులై16: భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపందాల్చి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే సీఎం కేసీఆర్ ఆదేశాలతో వరద ముంపు ప్రాంతాల్లో అన్ని రకాలుగా సహాయక, రక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగంతో కలిసి ప్రజలను రక్షించే ప్రయత్నంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ భాగస్వాములవుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలానికి సహాయక చర్యలు కొరకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభ్యర్థన మేరకు హెలికాప్టర్ ను అందుబాటులో ఉంచాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ను ఆదేశించారు. దీంతో శనివారం మధ్యాహ్నం హెలికాప్టర్ భద్రాచలం ముంపు ప్రాంతాల్లో అందుబాటులో ఉంది. హెలీకాప్టర్ తో పాటు వరద బాధితులను రక్షించేందుకు, సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉపయోగపడే లైఫ్ జాకెట్లు, తదితర రక్షణ సామగ్రిని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విజ్ఞప్తి మేరకు తరలించారు.

## తిరుమలలో భక్తుల రద్దీ.. శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం

తిరుమల, జులై 16 తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ కొనసాగుతుంది . కొండపై ఉన్న 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండాయి. శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారిని 72,195 మంది భక్తులు దర్శించుకోగా 35,967 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.24 కోట్లు వచ్చిందని వారు వివరించారు. రేపు శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# అనారోగ్యంతో నిరుపేద యువకుని మృతి



రాజన్న సిరిసిల్ల, జులై 16 (నేటినిజం ప్రతినిధి): రాజన్నసిరిసిల్లజిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన బొడ్డు ప్రవీణ్ (26) అనే యువకుడు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు.నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అయినందున వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేనందున వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి కూడా గత మూడు సంవత్సరాల కింద అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. మృతునికి తల్లి,ఇద్దరు సోదరులు ఉన్నారు. వీరికి ఉండడానికి ఇల్లు లేక కేవలం రేకుల షెడ్డులో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎలాంటి ఆస్తులు, భూములు లేవు. అట్టి అత్యంత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని దళిత బంధు మంజూరు చేయాలని ఈ సందర్భంగా బూరుగుపల్లి గ్రామస్తులందరూ ముక్తకంఠంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ కుటుంబ పరిస్థితి చూసి బూరుగుపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ? 5000 రూపాయల సహాయం అందించగా, బూరుగుపల్లి గ్రామ జన్మభూమి సేవా సంస్థ వారు ? 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవిశంకర్ చొరవ తీసుకొని దళితబంధు, డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. బొడ్డు ప్రవీణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎన్‌సీఎల్ పనితీరుని సమీక్షించిన బొగ్గు శాఖ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ జైన్

న్యూఢిల్లీ, జులై 16: బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ జైన్ మాట్లాడుతూ " స్థిరమైన బొగ్గు మైనింగ్‌ను ప్రోత్సహించడానికి నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) ఆసక్తిగా ఉందని, ఇది బొగ్గు మినీరత్న ద్వారా ఇటీవలి కార్యక్రమాలలో ప్రతిబింబిస్తోందని అన్నారు. కంపెనీ పనితీరును అంచనా వేయడానికి డాక్టర్ జైన్‌తో పాటు జాయింట్ సెక్రటరీ, శ్రీమతి.విస్మిత తేజ్ ఎన్‌సీఎల్‌ని సందర్శించారు.

ఎన్‌సీఎల్ సీనియర్ అధికారులతో ఇంటరాక్ట్ అయిన సందర్భగా ఇంధన రంగంలో దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి బొగ్గు ఉత్పత్తిని మరియు స్థిరమైన పద్ధతిలో కొనసాగించాల్సిన అవసరాన్ని సెక్రటరీ నొక్కిచెప్పారు. పర్యావరణంపై దాని ప్రభావాన్ని తగ్గించడానికి మైనింగ్ ప్రక్రియలో వినూత్న పద్ధతులను అవలంబించాలని ఆయన పిలుపునిచ్చారు మరియు వ్యాపార వైవిధ్య వ్యూహాలను అనుసరించాలని ఎన్‌సీఎల్ బృందాన్ని కోరారు.ఎన్‌సీఎల్ సీఎండీ శ్రీ భోలా సింగ్,డీటి (పిడిపి), సిటివితో పాటు ఇతర సీనియర్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

నిగాహి ఏరియాలో 50 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు కూడా డాక్టర్ అనిల్ కుమార్ జైన్ శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్ 129.35 హెక్టార్ల విస్తీర్ణంలో ఏటా 94 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నెలకొల్పబడుతుంది.

అలాగే కార్బన్ ఉద్గారాలను సంవత్సరానికి 78020 టన్నులు తగ్గించడానికి దారి తీస్తుంది. ఉత్పత్తి చేయబడిన విద్యుత్తు ఎన్‌సీఎల్ ద్వారా కార్యాచరణ మరియు ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించబడుతుంది. నికర జీరో లక్ష్యాన్ని సాధించడానికి కంపెనీ పునరుత్పాదక వనరుల నుండి రాబోయే కాలంలో 273 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించడానికి సిద్ధంగా ఉంది.

నిగాహి ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిని సందర్శించి గని ఆపరేషన్‌ను కూడా డాక్టర్ జైన్ పర్యవేక్షించారు. జయంత్ ఏరియాలో కొనసాగుతున్న ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాజెక్ట్ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) స్థలాన్ని కూడా ఆయన పరిశీలించారు. ఇటువంటి తొమ్మిది ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాజెక్టలలో రూ. 3100 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడితో ఎన్‌సీఎల్ పనిచేస్తోంది. వీటిలో ఇప్పటికే రెండు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 2023-24 నాటికి ఈ ఎఫ్‌ఎంసీ ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంతో, ఎన్‌సీఎల్ పర్యావరణ అనుకూలమైన మరియు యాంత్రిక పద్ధతిలో ఉత్పత్తి చేయబడిన మొత్తం బొగ్గును పంపే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

డాక్టర్ అనిల్ కుమార్ జైన్ మరియు జాయింట్ సెక్రటరీ శ్రీమతి విస్మిత తేజ్ సందర్శన సమయంలో బొగ్గు వినియోగదారులతో సహా కంపెనీకి చెందిన వివిధ వాటాదారులతో సంభాషించారు.

మధ్యప్రదేశ్ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని సింగ్రౌలీ మరియు సోన్‌భద్ర జిల్లాలో ఉన్న 10 అత్యంత మెకనైజ్డ్ ఓపెన్‌కాస్ట్ గనుల నుండి ఎన్‌సిఎల్ ఏటా 122 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తుంది.

## తిరుపతి టౌన్ బ్యాంక్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం : ఎమ్మెల్యే భూమన



తిరుపతి,జులై 16:వందేళ్లు చరిత్ర కలిగిన తిరుపతి కోపరేటివ్ బ్యాంకును పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తెలియజేశారు. శనివారం ఆయన విస్తృతంగా అభ్యర్థులతో కలిసి ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూల వీధి, పల్లె వీధి, ప్రాంతాల నందు తిరుపతి బ్యాంకు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నాగర్ మేయర్ డాక్టర్ శిరీష్ యాదవ్ కలిసి ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 20వ తేదీ జరగనున్న టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన 12 మంది డైరెక్టర్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఖాతాదారులకు అభ్యర్థిస్తున్నా అన్నారు.. జగనన్న ప్రభుత్వంపై టీడీపీ నాయకులు పనిగట్టుకుని విషం కక్కుతున్నారు.

టీడీపీ వాళ్ళు చేస్తున్న విమర్శలను ప్రజలు ఎవరూ పట్టించుకోవడం లేదు. జగనన్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు చాలా సంతృప్తిగా ఉన్నారు. టౌన్ బ్యాంక్ ఎన్నికల ప్రచారానికి వెళుతున్నప్పుడు వారు మమ్మల్ని నిండు మనస్సుతో స్వాగతిస్తూ ఆదరిస్తున్నారు. వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థులకే ఓట్లు వేస్తామని ముక్తకంఠంతో చెబుతున్నారు.

తిరుపతి టౌన్ బ్యాంకును టీడీపీ నాయకులు, వారి కనుసన్నల్లో నడిచిన పాలక మండలి సర్వనాశనం చేశారు. అందుచేత వారికి మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. వైఎస్సార్సీపీ బలపరుస్తున్న డైరెక్టర్లు అభ్యర్థులు చాలా ఉత్సాహంతో పని చేస్తారు. 12 కి 12 మంది పని చేసే సామర్థ్యం కలిగిన వారే ఉన్నారు. ఈ పాలకమండలి అధికారంలోకి రాగానే ఖాతాదారులకు మెరుగైన, పారదర్శక పాలన అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అభ్యర్థులు కేతం జయచంద్రా రెడ్డి, రేమాల బ్రహ్మానంద రెడ్డి, పోలిరెడ్డి నాగిరెడ్డి, అనిల్ రాయల్, మబ్బు నాధముని రెడ్డి, వాసుదేవ యాదవ్, వెంకటేష్ రాయల్, మాకం చంద్రయ్య, వేమూరి జ్యోతి ప్రకాష్, కాసీం, సురేష్ కుమార్ రెడ్డి, అమర నాధరెడ్డి పాల్గొన్నారు.

## ఫుడ్ పాయిజన్‌తో ఒకరు మృతి.. ఐదుగురి పరిస్థితి విషమం..



అమరావతి, జులై 16: పల్నాడులోని గురజాలలో విషాదం చోటుచేసుకుంది. మదర్సాలో కలుషిత ఆహారం తిని ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. మదర్సాలో మొత్తం ఆరుగురు కలుషిత భోజనం చేయగా అది కాస్త ఫుడ్ పాయిజన్ అయ్యింది. విషయం తెలుసుకున్న సిబ్బంది వీరిని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పిడుగురాళ్లకు తరలించారు.

## ఖాదీ కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఖాదీ' ద్వారా నాలెడ్జ్ పోర్టల్‌ను ప్రారంభించిన కేవీఐసీ

న్యూఢిల్లీ, జులై 16: ఖాదీ నాలెడ్జ్ పోర్టల్ అనేది ఖాదీ సంస్థలకు డిజైన్ సంబంధిత విషయాలను అందించేందుకు ఏర్పాటు చేయబడింది. దీనిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఖాదీ అభివృద్ధి చేసింది. 14 జూలై 2022న కేవిఐసి ముఖ్య కార్యదర్శి, శ్రీమతి ప్రీతా వర్మ ఈ పోర్టల్‌ని ప్రారంభించారు. ఖాదీ సంస్థలకు మద్దతుగా నిఫ్ట్‌లో ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ కేవిఐసీ ద్వారా ఖాదీ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేశారు.

ఖాదీ కోసం ఈ నాలెడ్జ్ పోర్ట్ డిజైన్ పరిజ్ఞానాన్ని ఖాదీ సంస్థల యొక్క విస్తృత విభాగాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తుంది. ఖాదీకి ప్రత్యేకంగా సరిపోయే నూతన ట్రెండ్‌లను సరళీకృతం చేయడం ద్వారా డిజైన్‌ని పోర్టల్ రూపొందిస్తుంది. మొదటి వాల్యూమ్‌లో నాలుగు కథలు/డిజైన్ లను రూపొందించారు. ప్రతి డిజైన్‌కు కీలకమైన థీమ్, రంగుల పాలెట్ మరియు నేసిన డిజైన్‌లు, ప్రింట్లు, అల్లికలు మరియు ఉపరితలం కోసం పలు డిజైన్స్ ఉంటాయి. ప్రతి డిజైన్ రెండు భాగాలుగా విభజించబడింది - ఇల్లు మరియు దుస్తులు. థీమ్‌లతో పాటు, పోర్టల్ సైజ్ చార్ట్‌లు, సిల్హౌట్ బోర్డ్‌లు, బటన్‌లు మరియు క్లోజర్‌లు, ఫినిషింగ్‌లను ఇల్లు మరియు దుస్తులు రెండింటికీ అందిస్తుంది.

వివిధ కాలాలకు ట్రెండ్‌లకు అనుగుణంగా డిజైన్స్‌ను అందించడానికి పోర్టల్‌లో సమాచారం సంవత్సరానికి రెండుసార్లు నవీకరించబడుతుంది. ఖాదీ సంస్థలకు మాత్రమే కాకుండా, ఖాదీ కోసం దుస్తులు, గృహోపకరణాలు మరియు ప్యాకేజింగ్‌ను అభివృద్ధి చేయడానికి మద్దతునిచ్చే సంస్థలకు కూడా సమాచారం విలువైనదిగా ఉంటుంది. ఇండ్ల కోసం మరియు దుస్తులు కోసం అల్లికలు మరియు నిర్మాణాలను సృష్టించే అవకాశాలను అన్వేషించడానికి ఖాదీ నూలు యొక్క వివిధ మందాలను ఉపయోగించి పోర్టల్‌లో వస్త్రాలు ప్రత్యేకంగా చూపబడ్డాయి.

## వరద బాధితులకు సహాయక చర్యలు వేగవంతం చేయండి : పంచాయతీ రాజ్ కమిషనర్



ఖమ్మం, జులై 16: (నేటినిజం ప్రతినిధి): బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర్ గ్రామంలో స్టెల్లా మెరిస్ పాఠశాల నందు గోదావరి వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని గోదావరి ఫ్లడ్స్ స్పెషల్ అధికారులు, పంచాయతీ రాజ్ కమిషనర్ హనుమంతరావు, ఆర్డీవో వెంక రెడ్డి, బూర్గంపహాడ్ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి వరదలపై తక్షణ సమాచారం తెలియజేసేందుకు జిల్లా కలెక్టర్ టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించి.. పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాధితులకు సహాయక చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. వరదలు తగ్గేవరకు ప్రయాణాలను రద్దు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విద్యాలత, స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, స్థానిక టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కైపు ఖగేందర్ రెడ్డి, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ పరమేష్, ఆంధ్రప్రభ విలేకరి జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, పలు శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వ్యాకరణం - భాష - విమర్శ
సందేహాలు - సమాధానాలు - చర్చ
అంశం:
తెలుగు భాష
– ధ్వని, వర్ణ నిర్మాణాలు

వక్త:
ఆచార్య అయినవోలు ఉషాదేవి
విశ్రాంత ఆచార్యులు,
భాషాభివృద్ధి పీఠం,
తెలుగు విశ్వవిద్యాలయం
తేది, సమయం: 17.07.2022 ఆదివారం ఉదయం 11 గంటలకు
తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో...
తెలంగాణ సారస్వత పరిషత్తు పూర్వ విద్యార్థులు,
తెలుగు భాషా చైతన్య సమితి
Zoom ID:
281 858 9873
Password: 223344

# శపథం నెరవేర్చుకున్న పంచాయితీ సభ్యుడు - ఏడేళ్ల తర్వాత చెప్పులు వేసుకున్న విక్రమ్ భలేశ్వర్



న్యూఢిల్లీ, జులై 16: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జిల్లా పంచాయతీ సభ్యుని ఎన్నికల్లో గెలిచిన విక్రమ్ భలేశ్వర్ ఏడేళ్ల తర్వాత బూట్లు .. చెప్పులు ధరించి మధ్యప్రదేశ్ ఎన్నికలకు వెళుతున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన విక్రమ్ ఎన్నికల్లో గెలిచే వరకు చెప్పులు వేసుకోనని శపథం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో ఇప్పుడు ఎన్నికల్లో గెలిచి చెప్పులు తొడుక్కుంటానన్నారు. విక్రమ్ భలేశ్వర్ భోపాల్ జిల్లా పంచాయతీ వార్డు-8 నుండి సభ్యునిగా ఎన్నికయ్యారు. 3 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. తన గెలుపు కోసం విక్రమ్ పాదరక్షలు లేకుండా గ్రామ గ్రామాన ప్రచారం చేశారు.

ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత విక్రమ్ 132 గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి తనకు లభించిన ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత బూట్లు, చెప్పులు వేసుకున్నాడు. ప్రజలు తనను ఆశీర్వదించారని విక్రమ్ భలేశ్వర్ అన్నారు. 38 ఏళ్ల విక్రమ్ ఎంఏ వరకు చదివిన రైతు. 2010 పంచాయతీ ఎన్నికల్లో తాను తొలిసారి పోటీ చేసిఓడిపోయానని విక్రమ్ చెప్పారు. ఆ తర్వాత మండి కమిటీ ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారు. 2015లో జరిగిన జిల్లా పంచాయతీ ఎన్నికల్లో 62 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఎన్నికల్లో గెలిచే వరకు చెప్పులు లేకుండానే ఉంటానని శపథం చేశారు.

# గోదావరి వరద ప్రాంతాల్లో సీఎం వైఎస్ జగన్ ఏరియల్ సర్వే.. కూయాప్‌లో వీడియో పోస్ట్..



అమరావతి, జులై 16: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు, ధవళేశ్వరం బ్యారేజీ, లంక గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా, యానాం ప్రాంతాల్లో పరిస్థితులను హెలికాప్టర్ ద్వారా సుమారు గంటన్నర పాటు ప్రత్యక్షంగా పరిశీలించారు. ముంపునకు గురైన పొలాలు, ఇళ్లు, రహదారులను పరిశీలించి పరిస్థితిపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం తన క్యాంపు కార్యాలయం నుంచి వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. సీఎం జగన్ ఏరియల్ సర్వే వీడియోను సీఎంఓ కూ యాప్ లో పోస్ట్ చేసింది.

# 14 రాష్ట్రాల్లో ఏర్పాటైన 166 సి.ఎన్.జి. కేంద్రాలు!




న్యూఢిల్లీ, జులై 16: దేశంలోని 14 రాష్ట్రాల్లో నెలకొల్పిన 166 కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సి.ఎన్.జి.) కేంద్రాలను కేంద్ర పెట్రోలియం, సహజవాయువు, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి ఈ రోజు జాతికి అంకితం చేశారు. సహజవాయు ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలను సాకారం చేసే కృషిలో భాగంగా ఈ సి.ఎన్.జి. కేంద్రాలను ఏర్పాటు చేశారు. 14 రాష్ట్రాల్లోని 41 భౌగోళిక ప్రాంతాల్లో కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) ఆధ్వర్యంలో ఈ సి.ఎన్.జి. కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గెయిల్ సిటీ గ్రూపు పంపిణీ సంస్థల్లో (సి.జి.డి.లలో) 9 కంపెనీలు ఈ సి.ఎన్.జి. కేంద్రాల్లో ఏర్పాటులో పాలుపంచుకున్నాయి.

ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీడియో లింక్ ద్వారా కొత్త సి.ఎన్.జి. కేంద్రాలన్నింటినీ కేంద్రమంత్రి పూరి జాతికి అంకితం చేశారు. కేంద్ర పెట్రోలియం, సహజవాయవు, కార్మిక, ఉపాధి కల్పనా శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలీ, పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్,త పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ, ఆయిల్ గ్యాస్ కంపెనీల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి పూరి మాట్లాడుతూ, సి.ఎన్.జి. కేంద్రాల వ్యవస్థ విస్తరణను చేపట్టిన గెయిల్‌కు, ఆ సంస్థకు సంబంధించిన సి.జి.డి.లకు అభినందనలు తెలిపారు. రూ. 400కోట్ల వ్యయంతో ప్రారంభించిన ఈ సి.ఎన్.జి. కేంద్రాలతో గ్యాస్ ఆధారిత మౌలిక సదుపాయాల వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, దేశంలో స్వచ్ఛమైన ఇంధనం మరింతగా అందుబాటులోకి వస్తుందని ఆయన అన్నారు. 2014లో దేశవ్యాప్తంగా 900 సి.ఎన్.జి. కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం సి.ఎన్.జి. కేంద్రాల సంఖ్య 4,500 దాటిందని అన్నారు. రానున్న రెండేళ్లలో వీటి సంఖ్య 8,000కు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఇక దేశంలో 2014 నాటికి 24లక్షల పైప్డ్ గ్యాస్ కనెక్షన్లు (పి.ఎన్.జి.లు) అందుబాటులో ఉండగా, వాటి సంఖ్య ఇపుడు 95లక్షలకు చేరిందన్నారు. ఇంత భారీ స్థాయిలో సి.ఎన్.జి. అందుబాటులోకి రావడంతో సి.ఎన్.జి. వాహనాలకు మార్కెట్ అవకాశాలపరంగా మరింత ప్రోత్సాహం లభిస్తుందని, దీనితో దేశంలో ఆ తరహా వాహనాల తయారీ, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన కూడా భారీగా పెరుగుతుందని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సి.ఎన్.జి. కేంద్రాలు నేరుగా దాదాపు వెయ్యిమందికి ఉపాధి కల్పిస్తాయన్నారు.

దేశంలో సి.ఎన్.జి. కేంద్రాల ఏర్పాటులో కీలకపాత్ర వహించిన బృందానికి కేంద్ర పెట్రోలియం, సహజవాయవు, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ కూడా తన ప్రసంగంలో అభినందనలు తెలిపారు. దేశ వ్యాప్తంగా పర్యావరణహితమైన ఇంధన వినియోగాన్ని మరింత విస్తృత స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. సి.ఎన్.జి., ద్రవీకృత సహజవాయువు (ఎల్.ఎన్.జి.) ఆధారిత స్వచ్ఛ ఇంధన సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే వాహనాలను ప్రోత్సహించే లక్ష్యంతో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్.ఐ.ఎ.ఎం.) ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కూడా కేంద్రమంత్రి పూరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోటారు వాహనాల రంగంలో మరింత స్వచ్ఛమైన ఇంధనాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా వాహనాలనుంచి వెలువడే కాలుష్యాన్ని బాగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత స్థాయిలో సి.ఎన్.జి., ఎల్.ఎన్.జి. ఇంధనాన్ని మరిన్ని ఎక్కువ సంఖ్యలో వాహనాలకు వర్తింపజేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

గెయిల్ సిటీ గ్రూపు పంపిణీ సంస్థల అభివృద్ధి కోసం పెట్రోలియం, సహజవాయు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలు, పనులు పూర్తికాగానే, దేశంలోని 98శాతం మంది ప్రజలకు, 88శాతం భౌగోళిక ప్రాంతానికి సహజవాయువుతో అనుసంధానం ఏర్పడుతుంది. రవాణా రంగానికి, గృహోపయోగానికి, పరిశ్రమలకు పర్యావరణ హితమైన సహజవాయు ఇంధనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు జరిగే కృషిలో ఈనాటి సి.ఎన్.జి. కేంద్రాల ప్రారంభోత్సవాన్ని ఒక కీలకమైన ముందడుగుగా చెప్పవచ్చు. ప్రస్తుతం సంప్రదాయబద్ధంగా వినియోగిస్తున్న అనేక ఇంధనాలకంటే సహజవాయు ఇంధనం ఎంతో సురక్షితమైనదే కాక, ఖర్చుపరంగా ఎంతో పొదుపైనది.

దేశంలో గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఒక బృహత్తరమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో భాగంగా ప్రధానంగా వినియోగంలో ఉన్న ఇంధనం వాటాలో సహజ వాయు వినియోగం వాటాను15శాతం వరకూ పెంచాలని ప్రధానమంత్రి నిర్దేశించారు. 2070వ సంవత్సరానికల్లా నెట్‌జీరో సాధించాలని భారతదేశ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కీలకపాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

# ఎబిడిఎం హాకెథాన్ శ్రేణి కింద తొలి హాకెథాన్‌ను మహారాష్ట్రలోని పూణెలో ప్రారంభించిన జాతీయ ఆరోగ్య అథారిటీ

న్యూఢిల్లీ, జులై 16: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ హాకెథాన్ శ్రేణి కింద జాతీయ ఆరోగ్య అథారిటీ (ఎన్‌హెచ్ఎ) తొలి హాకెథాన్‌ను 14 నుంచి 17 జులై 2022 వరకు మహారాష్ట్రలోని పూణెలో ఉన్న స్మార్ట్ సిటీ ఆపరేషన్స్ సెంటర్ లో హైబ్రిడ్ (మిశ్రమ) ఫార్మాట్‌లో నిర్వహిస్తోంది. ఈ హాకెథాన్‌ను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం) పూణె మున్సిపల్ కార్పొరేషన్ (పిఎంసి), పూణె స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (పిఎస్‌సిడిసిఎల్) సహకారంతో నిర్వహిస్తోంది. ఆవిష్కర్తలు, డెవలపర్‌లు (అభివృద్ధి చేసేవారు) డాటా నిపుణులకు చెందిన వివిధ బృందాలు ఆవిష్కరణ పరిష్కారాలను నిర్మించేందుకు భౌతికంగా, దృశ్యమాధ్యమం ద్వారా సహకరించారు.

హాకెథాన్‌ను ఎన్‌హెచ్ఎ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. ఎస్. శర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్య, డ్రగ్స్ విభాగం కార్యదర్శి శ్రీ సౌరభ్ విజయ్, ఎన్‌హెచ్ఎ అదనపు సిఇఒ డాక్టర్ ప్రవీణ్ గేదం ప్రారంభించారు. పిఎంసి కమిషనర్ శ్రీ విక్రమ్ కుమార్, ఆరోగ్య సేవలు, మిషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. రామస్వామి, ఎన్‌హెచ్ఎ డైరెక్టర్ శ్రీ కిరణ్ గోపాల్ వస్కా, పిఎస్‌సిడిసిఎల్ సిఇఒ డాక్టర్ సంజయ్ కోల్తే, సి-డిఏసి పూణె అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ గౌర్ సుందర్, పిఎంసి అదనపు కమిషనర్ శ్రీ రవీంద్ర బిన్‌వాడే, పిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ కునాల్ ఖేమ్నర్ పాల్గొన్నారు.

యుపిఎ పోషించిన పాత్రలానే, సమగ్ర ఆరోగ్య వినిమయసీమ (ఇంటర్‌ఫేస్) మార్కెట్ సమర్థతనిచ్చే పాత్రను పోషిస్తూ, బహుళ ఆరోగ్య సేవలను అందిస్తుందని ఎన్‌హెచ్ఎ సిఇఒ డాక్టర్ ఆర్. ఎస్, శర్మ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ చెప్పారు. ఇది ఆరోగ్య సంరక్షణకర్తల మధ్య పరస్పర చర్యను నిర్మించేందుకు, ఆరోగ్య సంరక్షణ డాటాను ఇచ్చిపుచ్చుకునే సౌకర్యాన్ని కల్పిస్తుంది. అంతిమంగా ఇది నాణ్యత కలిగిన ఆరోగ్య సంరక్షణ సరసమైన ధరలో అందరికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తోడ్పడుతుందని ఆయన అన్నారు.

తాము నిర్వహించాలని భావిస్తున్న హాకెథాన్ల పరంపరలో ఈ హాకెథాన్ మొదటిదని డాక్టర్. శర్మ చెప్పారు. ఇది తమ డిజిటల్ ఆరోగ్య పర్యావరణ వ్యవస్థ పునాదిరాళ్ళను మెరుగుపరిచేందుకు, దేశానికి, ప్రపంచానికి వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి దేశంలోని యువ ప్రతిభను ప్రోత్సహిస్తుందని ఆయన వివరించారు. సమగ్ర ఆరోగ్య వినిమయ సీమ (యునిఫైడ్ హెల్త్ ఇంటర్‌ఫేస్ - యుహెచ్ఐ)కు అదనంగా నూతన పరిష్కారాలను అభివృద్ధి చేయడం కోసం వ్యక్తులను, సంస్థలను ఒక చోట చేర్చడం ద్వారా భారత్‌లోని ఆరోగ్య స్టార్టప్‌ల వాతావరణ వ్యవస్థను సమీకరించడంపై హాకెథాన్ దృష్టిపెడుతుంది. తొలి రౌండ్ - కిక్ స్టార్టింగ్ యుహెచ్ఐ అన్న పేరుతో జరుగుతున్న బహుమాన మొత్తం రూ. 60,00,000. ఈ పరిష్కారాలను స్వతంత్ర్య జ్యూరీ అంచనా వేస్తుంది. బహుమానాలను రెండు ప్రధాన ఇతివృత్తాలలో అత్యంత బాగా రాణించిన వారికి అందచేస్తారు. ఆ రెండు ప్రధాన ఇతివృత్తాలు -

ఇన్నొవేషన్ ట్రాక్ (వినూత్న పద్ధతి): టెలికన్సల్టేషన్, అంబులెన్స్ బుకింగ్, ల్యాబ్ పరీక్షలు, భౌతిక కన్సల్టేషన్ బుకింగ్, ల్యాబ్ టెస్ట్‌ల బుకింగ్ వంటి వివిధ వినియోగ సందర్భాలలో బహిరంగ నెట్‌వర్క్‌లో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను శక్తిమంతం చేయడానికి వినూత్న పరిష్కారాల కోసం పోటీ.

ఇంటిగ్రేషన్ ట్రాక్ (సమన్వయ పద్ధతి): యుహెచ్ఐకి అనుకూలమైన అప్లికేషన్ల అభివృద్ధిని వేగవంతం చేయడం, ఈ అప్లికేషన్లను ఇతర భాగస్వామి అప్లికేషన్లతో సమన్వయ పరచడం ద్వారా యుహెచ్ ఐ నెట్‌వర్క్‌లో డిజిటల్ ఆరోగ్య లావాదేవీలకు తోడ్పాటునందించడంలో పోటీ. ఎబిడిఎం హాకెథాన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను https://abdm.gov.in/register అన్న లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా చూడవచ్చు. సమగ్ర ఆరోగ్య వినిమయ సీమ (యుహెచ్ఐ)కి సంబంధించిన మరింత సమాచారం https://uhi.abdm.gov.in/ లో అందుబాటులో ఉంది.

# త్యాగానికి మారుపేరు దుర్గాబాయ్

హైదరాబాద్, జులై 16: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఒక నిర్భయమైన స్వాతంత్ర సమరయోధురాలని, ధైర్యం, త్యాగానికి మారుపేరైన దుర్గాబాయ్ లేని లోటును మహిళలు ముందుకు వచ్చి పూర్తి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 113వ జయంతిని పురస్కరించుకొని బాగ్‌అంబర్‌పేట డివిజన్, డీడీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్‌వర్క్స్ చౌరస్తాలో గల దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ విగ్రహానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి కేంద్ర మంత్రి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం ఆనాడే ఆమె ఉద్యమించిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ మహిళలకు ఆమె ఎంతో సాధికారిత కల్పించారన్నారు. ఆమె ఆనాడు చేసిన ఆలోచననే నేటి ఎన్జీవోలు అని పేర్కొన్నారు.

దుర్గాబాయ్ సాధారణ మహిళా కాదని, స్వాతంత్రం రాకముందే మహిళా సాధికారికత గురించి మాట్లాడిన మొదటి వ్యక్తి అన్నారు.

అనంతరం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, నాయకులు పి.గోవర్ధన్‌రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పి.విజయ్‌కుమార్, వీణాడిగ్గీకర్, సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నితీశ్‌దేశ్‌పాండే, కరణ్‌రెడ్డి, పి.ఇంద్రారెడ్డి, డాక్టర్ హరిచరణ్, బీజేపీ నాయకులు సి.కృష్ణాగౌడ్, చుక్కజగన్, జె.బాల్‌రాజు, టీఆర్ఎస్ నాయకులు మిర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




# వ్యక్తి ఆత్మహత్య యత్నం.. కాపాడిన పోలీసులు..



అమరావతి, జులై 16: పెద్ద ముడియం మండలంలోని పెద్ద పసుపుల గ్రామానికి చెందిన పుల్లన్న(57) అనే వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు.

ముద్దనూరు రైల్వే స్టేషన్ లో రైలు కింద పడి ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వంశీ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ముద్దనూరు సీఐ మోహన్ రెడ్డి తక్షణమే రంగంలోకి దిగి ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని కాపాడి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెడ్ కానిస్టేబుల్ నాగశేషారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ వంశీ, మహిళా కానిస్టేబుల్ వాణిలను కడప జిల్లా ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్ అభినందించారు.

# 75 రోజుల పాటు ఉచిత బూస్టర్ డోస్

హైదరాబాద్, జులై 16:కరోనా మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బూస్టర్ డోస్‌ను ఇస్తుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే రెండు డోసులు తీసుకున్న 18 ఏళ్లు నిండిన వారందరికీ కూడా ఈ డోసును ఉచితంగా వేస్తారని చెప్పారు. నల్లకుంట తిలక్‌నగర్ యూపీహెచ్‌సీలో శుక్రవారం కార్పొరేటర్ అమృతతో కలిసి మంత్రి బూస్టర్ డోస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ఇంకా కనుమరుగు కాలేదని, కేసులు పెరుగుతున్నాయన్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 75 రోజుల పాటు ఉచిత బూస్టర్ డోస్ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.కాలేరు దీప్తిపటేల్, మాజీ కార్పొరేటర్లు వనం రమేష్, బి.వెంకటరెడ్డి, బీజేపీ హైద్రాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, నాయకులు మధుసూధన్, శ్యాంరాజ్, బుచ్చిరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కెరీర్ గైడెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్, జులై 16: స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్న పాఠశాలలో ఎస్ఆర్‌డీ, రెయిన్‌బో హోమ్స్, నిర్మాణ్, అమన్ వేదిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో టెన్త్‌క్లాస్ నుండి డిగ్రీ వరకు చదివిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియో గం చేసుకొని ఉన్నత విద్యారంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి ఈఓ చిరంజీవి, ఎస్ఆర్‌డీ శ్రీనివాస్ రెడ్డి, శివరాణి, పార్వతి, రెయిన్‌బో సిటీ డెస్క్ అహరోను జోష్, క్రాంతి కిరణ్, సమద్, ఆశ్రయ్ బాలతేజస్సు సంస్థ నవీన్ రాజ్, బాల్యమిత్ర నెట్‌వర్క్ కన్వీనర్ అంభిక, అశ్రిత స్వచ్ఛంద సంస్థ పర్వతాలు, అజన్య, అమన్ వేదిక స్వచ్ఛంద సంస్థ ఎల్లయ్య, నిర్మల, ఆలియా పర్వీన్, సంజీవ్, సురేష్, నాగభూషణం, జయ, సదాలక్ష్మి, అరుణ్ స్వచ్ఛంద సంస్థ అనిత, డేనియల్, ఆర్ఎఫ్ఐ సంస్థ సంధ్య, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాదు జిల్లా సమగ్ర స్వరూపం

పుస్తకావిష్కరణ మహోత్సవం మరియు కవి సమ్మేళనం

శ్రీవారి కల్యాణ మండపం, శ్రీ అపురూప వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం
(ఆర్మూర్ - నిజామాబాదు రోడ్, adjacent NH 63)
తేదీ: 17-07-2022, ఆదివారం ఉ.10.30

**జనరల్ ప్రోగ్రాం**

| | |
|---|---|
| 10.00 am అతిథులు సభాస్థలికి విచ్చేయడం<br>10.00 am - 10.15 am అల్పాహారం | ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్<br>డా.జె.చెన్నయ్య, కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్<br>శ్రీ మంత్రి రామారావు, కోశాధికారి, తెలంగాణ సారస్వత పరిషత్ |

**1st SESSION**

| | |
|---|---|
| అతిథులను వేదికపైకి ఆహ్వానించడం 10.30 - 10.35<br>డా.కాసర్ల నరేశ్ రావు<br>డా.వి.త్రివేణి | ముఖ్య అతిథి: ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్<br>విశిష్ట అతిథి: డా.జె.చెన్నయ్య, కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్<br>గౌరవ అతిథి: శ్రీ మంత్రి రామారావు, కోశాధికారి, తెలంగాణ సారస్వత పరిషత్<br>కన్వీనర్ - జిల్లా కోర్ కమిటీ : డా.అమృతలత<br>సభ్యులు - జిల్లా కోర్ కమిటీ : డా. వి. త్రివేణి, డా. కాసర్ల నరేశ్‌రావు, డా. శారదా హన్మాండ్లు, డా. గణపతి అశోకశర్మ, శ్రీ కందకుర్తి ఆనంద్, శ్రీమతి కిరణ్‌బాల, శ్రీ చింతల శ్రీనివాస గుప్త |

**అతిథుల పరిచయం**

| | |
|---|---|
| 10.35-10.37 డా.డి.శారద | ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్ |
| 10.37 - 10.38 బి.కళాగోపాల్ | డా.జె.చెన్నయ్య, కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్ |
| 10.38 - 10.40 డా.వారె దస్తగిరి | శ్రీ మంత్రి రామారావు, కోశాధికారి, తెలంగాణ సారస్వత పరిషత్ |

**కవి సమ్మేళనం**

| | |
|---|---|
| 10.40 am - 12.00 noon | మొదటి విభాగం<br>రెండవ విభాగం<br>మూడవ విభాగం<br>(సంబంధిత లిస్ట్ జతపరచడమైనది)<br>మొదటి సెషన్ |
| 12.00 | Arrival of the Chief Guest Sri A. JEEVAN REDDY |

**SECOND PART OF FIRST SESSION**

| | |
|---|---|
| 12.00-12.05 అతిథులను వేదికమీదికి ఆహ్వానించడం<br>డా.డి.శారద | ముఖ్య అతిథి: శ్రీ ఆశన్నగారి జీవన్‌రెడ్డి, MLA, (చైర్మన్, పి.ఎల్.సి. & అధ్యక్షులు, నిజామాబాద్‌జిల్లా తెలంగాణ రాష్ట్ర సమితి)<br>సభాధ్యక్షులు : ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్<br>విశిష్ట అతిథి: డా.జె.చెన్నయ్య, కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్<br>గౌరవ అతిథి: శ్రీ మంత్రి రామారావు, కోశాధికారి, తెలంగాణ సారస్వత పరిషత్<br>డా.అమృతలత, 'నిజామాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకం కోర్ కమిటీ కన్వీనర్ :<br>కోర్ కమిటీ సభ్యులు: |
| 12.05 - 12.10 | జ్యోతి ప్రకాశనం (అతిథులచే) |
| ముఖ్య అతిథి పరిచయం : డా.కాసర్ల నరేశ్‌రావు 12.10 - 12.13 | ముఖ్య అతిథి: శ్రీ ఆశన్నగారి జీవన్‌రెడ్డి, MLA (చైర్మన్, పి.ఎల్.సి. & అధ్యక్షులు, నిజామాబాద్‌జిల్లా తెలంగాణ రాష్ట్ర సమితి) |
| 12.13 - 12.17 | స్వాగతోపన్యాసం: విశిష్ట అతిథి: డా.జె.చెన్నయ్య, కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్ |
| 12.17 - 12.20 | కోర్ కమిటీ నివేదిక : డా.అమృతలత |
| 12.20 - 12.25 | అధ్యక్షోపన్యాసం: ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్ |
| 12.25 - 12.35 | ముఖ్య అతిథి శ్రీ ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎం.ఎల్.ఎ. గారిచే 'నిజామాబాదు జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణ |
| 12.35 - 12.45 | ముఖ్యఅతిథి : శ్రీ ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎం.ఎల్.ఎ. గారి సందేశం |
| 12.45 - 12.55 | సత్కారాలు : ముఖ్యఅతిథికి, వ్యాసకర్తలకు, కోర్ కమిటీ మెంబర్స్‌కి |
| 12.55 - 01.00 | వందన సమర్పణ గౌరవ అతిథి: శ్రీ మంత్రి రామారావు, కోశాధికారి, తెలంగాణ సారస్వత పరిషత్ |
| 01.00 - 01.30 | మధ్యాహ్న భోజనం |

**నిజామాబాదు జిల్లా కోర్ కమిటీ - సన్మానం**
03.30 - 03.35
కన్వీనర్ :డా. అమృతలత

సభ్యులు:
1. డా. వి. త్రివేణి
2. డా. కాసర్ల నరేశ్‌రావు
3. డా. శారదా హన్మాండ్లు
4. డా. గణపతి అశోకశర్మ
5. శ్రీ కందకుర్తి ఆనంద్
6. శ్రీమతి కిరణ్‌బాల
7. శ్రీ చింతల శ్రీనివాస గుప్త

**వ్యాసకర్తలకు సన్మానం**
03.35 - 03.45

| | | |
|---|---|---|
| 1. దర్భస్తు రాధ | 16. కైరంకొండ బాబు | 31.సిరిపురం సురేందర్ |
| 2. సిద్ద సాయరెడ్డి | 17. గంట్యాల ప్రసాద్ | 32.డా.అన్నందాస్ జ్యోతి |
| 3. కొసరాజు వెంకటేశ్వరరావు | 18. బాదరవేణి నాగరాజు | 33.కందకుర్తి సుమిత్ర |
| 4. కందకుర్తి యాదవరావు | 19.డా.వారె దస్తగిరి | 34. కిరణ్‌బాల |
| 5. సోము విఠల్ | 20. డా. గణపతి అశోకశర్మ | 35.డా.బలాస్ట్ మల్లేష్ |
| 6. మద్రిపల్లి భూపతి | 21. పెరుముల కైలాస్ | 36.పోత్నూరు లక్ష్మణ్ |
| 7. కందకుర్తి ఆనంద్ | 22. డా.బోచ్కర్ ఓంప్రకాశ్ | 37.బోడవార్ హన్మాండ్లు |
| 8. డా.దమ్మయి సాయిలు | 23.యం.శశికుమార్ | 38. వేముల శేఖర్ |
| 9. డా.డి.శారదాహన్మాండ్లు | 24. డా.కాసర్ల నరేశ్‌రావు | 39. మద్దుకూరి సాయిబాబు |
| 10. ఎనిశెట్టి శంకర్ | 25.డా.పింగళి గంగాధర్‌రావు | 40. కత్తి గంగాధర్ |
| 11.డా.వి.రూప్‌సింగ్ | 26.డా.వి.త్రివేణి | 41. కర్క రమేష్ |
| 12. డా.గంగల్ లక్ష్మీపతి | 27.మల్లవరపు చిన్నయ్య | 42. మీసాల ప్రశాంత్, |
| 13. దావుల వివేకానంద్ | 28.కళాగోపాల్ | 43. గంగామోహన్ |
| 14. పోలకొండ నాగరాజువర్మ | 29.చింతల శ్రీనివాసగుప్త | 44. మాదస్త ప్రణవి |
| 15. దేవులపల్లి ప్రశాంత్ | 30.డా.ఆర్.సాయిలక్ష్మి | |

**కవిసమ్మేళనంలో పాల్గొన్న వారికి సన్మానం**
03.45 - 03.58

వందన సమర్పణ :
03.58 - 04.00
డా.కాసర్ల నరేశ్‌రావు

# ఢిల్లీ, ముంబయిలలో ఆదాయపు పన్ను శాఖ సోదాలు

న్యూఢిల్లీ, జులై 16: ముంబయి కేంద్రంగా ఆతిథ్యం, మార్బుల్, లైట్స్ ట్రేడింగ్ మరియు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నిమగ్నమై ఉన్న ఒక గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ 07.07.2022న సోదాలు, జప్తు కార్యక్రమాలను నిర్వహించింది. ఢిల్లీ, ముంబయి మరియు డామన్‌లలో గల మొత్తం 18 ప్రాంగణాలలో ఈ శోధన చర్యలు జరిగాయి. సోదాల కార్యక్రమంలో హార్డ్ కాపీ డాక్యుమెంట్లు మరియు డిజిటల్ డేటా రూపంలో పెద్ద సంఖ్యలో నేరారోపణ ఆధారాలు కనుగొనబడ్డాయి, స్వాధీనం చేసుకోబడ్డాయి.

ఈ సాక్ష్యాలు కొన్ని తక్కువ పన్ను పరిధిలోని విదేశాలలో తమ వెల్లడించని డబ్బును ఉంచినట్లు తెలుస్తుంది. ఈ గ్రూప్ మలేషియా ఆధారిత వెబ్ ఆఫ్ కంపెనీల ద్వారా చివరకు భారత దేశంలో తన అతిథ్య వ్యాపారంలో నిధులను పెట్టుబడి పెట్టింది. అటువంటి నిధుల పరిమాణం రూ.40 కోట్లకు మించి ఉంటుందని అంచనా. సేకరించిన ఆధారాలు మేరకు విదేశాల్లోని కొన్ని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాయని, వీటిని ప్రత్యేకంగా కమోడిటీ ట్రేడింగ్ కోసం ఏర్పాటు చేసినట్టుగా సమాచారం. కంపెనీ ఆర్జించిన లాభాలతో సహా.. దాని నికర విలువను సంబంధిత కాలానికి ఐటీఆర్‌లలో గ్రూప్ వెల్లడించలేదు. ఇంకా సమూహం యొక్క ప్రమోటర్ విదేశీ అధికార పరిధిలో స్థిరమైన ఆస్తిలో పెట్టుబడి పెట్టినట్లు గుర్తించబడింది. అది కూడా అతని ఆదాయపు పన్ను రిటర్న్‌లో వెల్లడించలేదు. ఇవియే కాకుండా, కమోడిటీ ట్రేడింగ్ కోసం ఏర్పాటు చేయబడిన కొన్ని ఆఫ్‌షోర్ సంస్థలు గుర్తించబడ్డాయి అవి కూడా బయటకు సంస్థ ప్రకటించలేదు. సోదాలలో గ్రూప్ తన భారత కార్యకలాపాలలో పుస్తకాలకు వెలుపల నగదు అమ్మకాల్లో పాలుపంచుకున్నట్లు వెల్లడైంది. మార్బుల్ మరియు లైట్ల వ్యాపారంలో, స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల మేరకు మొత్తం అమ్మకాలలో 50% నుండి 70% వరకు లెక్కించబడని నగదు అమ్మకాలను సూచిస్తున్నాయి. వెల్లడించని అదనపు స్టాక్ రూ. 30 కోట్లు కూడా దొరికాయి.

అతిథ్య వ్యాపారంలో, బాంక్వెట్ డివిజన్‌లో మరీ ప్రత్యేకంగా లెక్కించబడని అమ్మకాలు కనుగొనబడ్డాయి. ఇప్పటి వరకు రూ. 2.5 కోట్లు మేర విలువైన ప్రకటించని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణలు కొనసాగుతున్నాయి.

# విశాఖ స్టీల్ ప్లాంట్ లో సీబీఐ సోదాలు

అమరావతి, జులై 16: విశాఖ స్టీల్ ప్లాంట్ లో సీబీఐ అధికారులు సోదాలు చేస్తున్నారు. ప్లాంట్ ప్రొడక్షన్ ఆఫీసర్ పదంసింగ్ ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పదం సింగ్ తో పాటు రీజనల్ మేనేజర్ రెడ్డయ్య, మరో ఇద్దరు బ్రోకర్లను అరెస్ట్ చేశారు. పదంసింగ్ పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కు లంచం తీసుకున్నారు.

# ములుగు ఏజెన్సీ ముంపు ప్రాంతాలను పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి



ములుగు, జులై 16 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో గోదావరి వరదతో నీటమునిగిన ఏజెన్సీ ప్రాంతాల్లో మంద్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యటించారు. గోదావరి నది ఉధృతిని, ముంపు ప్రాంతాలు, వర్షాలతో దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. వరద సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించారు. ముంపు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏటూరు నాగారం ఐటీడీఏ కార్యాలయంలో వరద పరిస్థితులపై అధికారులతో సమావేశం కానున్నారు.



సంగారెడ్డి జిల్లా ఫసాల్ వాది, కంది, సదాశివపేటలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ , మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , మునిసిపల్ చైర్మన్ విజయ లక్ష్మి , సంబధిత అధికారులు.




# నూటికి నూరు శాతం గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ సాధించిన తమిళనాడులోని పప్పన్ కుళి గ్రామం

న్యూఢిల్లీ, జులై 16: కమ్యూనిటీ సభ్యులు , ప్రభుత్వ అధికారుల సమిష్టి కృషి కారణంగా, తమిళనాడు కాంచీపురం జిల్లాలోని పప్పన్కుళి గ్రామ పంచాయితీలో బూడిదరంగు నీటి నిర్వహణ వ్యవస్థ నూటికి నూరు శాతం విజయవంతంగా అమలు జరిగింది. వ్యక్తిగత ఇంటి ఇంకుడు గుంతలు , కమ్యూనిటీ ఇంకుడు గుంతలను హారిజోనల్ లేదా వర్టికల్ టైప్ ఫిల్టర్ తో కూడిన ఈ సిస్టమ్, గ్రామంలో రోజుకు ఉత్పత్తి అయ్యే 42,000 లీటర్ల గ్రే వాటర్ ని సమర్థవంతంగా శుద్ధి చేస్తుంది.

ఈ చొరవ స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ (ఎస్ బిఎమ్-జి) ఫేజ్ 2 క్యాంపెయిన్ లో ఒక భాగం, దీనిలో గ్రేవాటర్ మేనేజ్ మెంట్ ఒక అంతర్భాగం.

కమ్యూనిటీ నాయకత్వం: గ్రామంలో గ్రే వాటర్ మేనేజ్ మెంట్ ఆవశ్యకతను, ఘన, ద్రవ వ్యర్థాల మేనేజ్ మెంట్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడంలో స్వచ్ఛగ్రాహి, శ్రీమతి ఎ. సరళా దేవి కీలక పాత్ర పోషించారు. బూడిద రంగు నీరు అంటే ఏమిటి , బూడిదరంగు నీటి నిర్వహణ సరిగా లేకుంటే జరిగే హాని, నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ తరువాత, గ్రామ ప్రెసిడెంటు , పంచాయితీ కార్యదర్శి శ్రీ గణేశన్ గ్రేవాటర్ నిర్వహణ అవసరాన్ని ఆచరణలో పెట్టడం లో కీలక పాత్ర పోషించారు. 2021 నవంబరులో పప్పన్కుళిలో ఇందుకు సంబంధించిన ఒక వ్యవస్థను స్థాపించడానికి అవసరమైన నిధులను కేటాయించారు.

ఈ వ్యవస్థ ఆపరేషన్ , మెయింటెనెన్స్ గురించి పంచాయితీ శ్రద్ధ వహిస్తూనే మరింత మెరుగైన నిర్వహణ కోసం కొన్ని జాగ్రత్తలు పాటించేలా కమ్యూనిటీని ప్రోత్సహించారు. ఇందులో వ్యర్థాలను డ్రైనేజీ ఛానల్ లోనికి డంప్ చేయకుండా చూసుకోవడం కూడా ఉంది; బూడిదరంగు నీరు నిలిచిపోకుండా నిరోధించడానికి పూడిక తొలగించడం తో పాటు క్రమం తప్పకుండా ప్రవాహ నీటి కాలువను శుభ్ర పరిచే ప్రక్రియ ను కొనసాగించారు.

గ్రామ నేపథ్యం: కాంచీపురం జిల్లాలోని శ్రీపెరంబుదూర్ బ్లాక్ లో ఉన్న పప్పన్కుళి రెండు ఆవాసాలను కలిగి ఉంది, అవి పప్పన్కుళి గ్రామం , పప్పన్కుళి కాలనీ 474 గృహాల నుండి మొత్తం 1016 జనాభాతో ఉన్నాయి. గ్రామంలో 30,000 లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. ప్రతిరోజూ, గృహాలు సుమారు 60,000 లీటర్ల నీటిని వినియోగిస్తాయి, వీటిలో 70 శాతం బూడిద రంగు నీరుగా మారుతుంది, ఇది రోజుకు 42,000 లీటర్లు.

ఇంతకు ముందు, అటువంటి నిర్వహణ వ్యవస్థ లేనప్పుడు, బూడిదరంగు నీటిని రోడ్లపైకి వదలడం వల్ల కాలుష్యానికి, నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి, కాలుష్యం ఏర్పడి దోమలు, సూక్ష్మజీవులు , పరాన్నజీవులకు సంతానోత్పత్తి కేంద్రంగా ఉండేది. తద్వారా డెంగ్యూ, మలేరియా , కలరా వంటి వ్యాధులకు దారి తీసేది. పరిస్థితిని మరింత దిగ జార్చేలా నీటి వనరులలోకి బహిరంగ డంపింగ్ , విడుదల జరిగింది, ఇది అధిక నీటి మట్టం ఉన్న ప్రాంతాలలో ఉపరితల, భూగర్భ జలాలను కలుషితం చేసింది. తీవ్రమైన నీటి కొరత నుండి ఉపశమనం కలిగించడానికి శుద్ధి చేసిన గ్రే వాటర్ ను ఉపయోగించవచ్చని సమాజానికి కూడా తెలియదు.

గ్రే వాటర్ అంటే ఏమిటి: గ్రే వాటర్ అనేది మల పదార్థం లేదా మూత్రంతో కలుషితం కాని వ్యర్థ నీటి యొక్క కేటగిరీ. స్నానం చేసిన నీరు, పాత్రలు కడిగిన నీరు, లాండ్రీ నీరు మొదలైనవి గ్రే వాటర్ తరగతి కిందకు వస్తాయి. సమర్థవంతంగా గ్రే వాటర్ నిర్వహణ (జిడబ్ల్యుఎమ్) కోసం అనుసరించిన ఇంకుడు గుంతల నమూనాలు: వ్యక్తిగత ఇంటి స్థాయిలో బూడిదరంగు నీటిని నిర్వహించడానికి అనువైన వ్యక్తిగత ఇంటి ఇంకుడు గుంతలను 93 గృహాలలో ఒక్కొక్కటి రూ. 9300 ఖర్చుతో నిర్మించారు. ఇంకా, హారిజాంటల్ టైప్ ఫిల్టర్ తో 2 కమ్యూనిటీ ఇంకుడు గుంతలను డ్రైనేజీ వ్యవస్థల డిస్పోజల్ పాయింట్ల వద్ద ఒక్కొక్కటి రూ. 1,33,000 ఖర్చుతో నిర్మించారు. ఇటువంటి ఇంకుడు గుంతలు అధిక భూగర్భజల పట్టిక కలిగిన క్లస్టర్ లకు అనుకూలంగా ఉంటాయి శుద్ధి చేసిన నీటిని వ్యవసాయ అవసరాలకు ఉపయోగించవచ్చు. అదనంగా, తక్కువ నీటి పట్టిక కలిగిన క్లస్టర్ లకు అనువైన వర్టికల్ టైప్ ఫిల్టర్ తో ఒక కమ్యూనిటీ ఇంకుడు గుంతను డ్రైనేజీ సిస్టమ్ డిస్పోజల్ పాయింట్ వద్ద రూ. 127,000 ఖర్చుతో నిర్మించారు.

స్థానికంగా లభ్యం అయ్యే మెటీరియల్ తో వ్యక్తిగత గృహాల ఇంకుడు గుంతలను నిర్మించడం సులభం. ఈ వ్యవస్థ కింద గ్రే వాటర్ ను మూలం వద్ద నే శుద్ధి చేయవచ్చు, గ్రామ రహదారుల పైకి,, బహిరంగ ప్రదేశంలోకి, భూమి లేదా లోతట్టు ప్రాంతాలలో గ్రే వాటర్ ప్రవహించకుండా నిరోధించవచ్చు. పప్పన్కుళి గ్రామంలో, 93 గృహాలను డ్రైనేజీ కాలువకు అనుసంధానించలేకపోయారు అందువల్ల బూడిద నీటిని నిర్వహించడానికి వ్యక్తిగత ఇంటి ఇంకుడు గుంతలను కల్పించారు.

వ్యక్తిగత గృహ సోక్ పిట్ భాగాలు ఒక నీటి సేకరణ పైపు లేదా ప్లాట్‌ఫారమ్‌ను కలిగి ఉంటాయి, ఇక్కడ గృహాలలో ఉత్పత్తి చేయబడిన గ్రేవాటర్ సేకరించబడుతుంది; గ్రేవాటర్‌లో సస్పెండ్ చేయబడిన ఘన మరియు ఇతర తేలియాడే పదార్థాలు ఫిల్టర్ చేయబడే తనిఖీ గది; మరియు సస్పెండ్ చేయబడిన కణాలు స్థిరపడిన ప్రదేశంలో ఉంచబడిన కాంక్రీట్ టబ్‌తో కూడిన సోక్ పిట్, గ్రేవాటర్ వడపోత మాధ్యమంలోకి పొంగిపొర్లుతుంది, అక్కడ అది ఫిల్టర్ చేయబడి సురక్షితంగా భూమిలోకి చొచ్చుకుపోతుంది.

హారిజాంటల్ , వర్టికల్ టైప్ ఫిల్టర్ లతో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు: హారిజాంటల్ , వర్టికల్ టైప్ ఫిల్టర్ ఇంకుడు గుంతలు రెండూ కూడా స్థలం పరిమితులు ఉన్న గృహాల నుంచి ఉత్పత్తి అయ్యే బూడిదరంగు నీటిని శుద్ధి చేయడం లో సమర్థవంతంగా పనిచేస్తాయి. వీటిని ఇవి సాధారణంగా డ్రైనేజీ వ్యవస్థల డిశ్చార్జ్ పాయింట్ల వద్ద నిర్మిస్తారు.

పప్పన్ కుళి గ్రామంలో గ్రే వాటర్ డిస్పోజల్ పాయింట్ వరకు డ్రైనేజీ వ్యవస్థలు నిర్మించబడ్డాయి. హారిజాంటల్ టైప్ ఇంకుడు గుంతలు అధిక నీటి పట్టిక ఉన్న ప్రదేశాలకు అనుకూలంగా ఉంటాయి, ఇక్కడ శుద్ధి చేసిన నీటిని తిరిగి పొందవచ్చు వ్యవసాయ కార్యకలాపాలకు తిరిగి ఉపయోగించవచ్చు; పప్పన్కుళి గ్రామంలో ఇటువంటి రెండు ఇంకుడు గుంతలు నిర్మించబడ్డాయి.

మరోవైపు, క్షితిజ సమాంతర రకం ఇంకుడు గుంతలతో పోలిస్తే వర్టికల్ టైప్ ఇంకుడు గుంతలకు తక్కువ భూమి వైశాల్యం అవసరం అవుతుంది అలాగే తక్కువ నీటి మట్టంఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించవచ్చు, ఇక్కడ శుద్ధి చేసిన నీరు భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి సహాయపడుతుంది. పప్పన్కుళిలో శివన్ కోయిల్ వీధికి సమీపంలో రూ. 1,27,000 వ్యయంతో ఒక వర్టికల్ ఇంకుడు గుంత ను నిర్మించారు.

# షాంఘై సహకార సంస్థతో సహకారాన్ని పెంపొందించుకోవాలని భారతదేశం నిశ్చయించుకుంది: డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే

న్యూఢిల్లీ, జులై 16: షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ )తో సహకారాన్ని పెంపొందించుకోవాలని భారతదేశం నిశ్చయించుకుంది. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల పరిశ్రమల మంత్రుల 2వ సమావేశానికి వర్చువల్‌గా హాజరైన కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి డాక్టర్ మహేంద్ర నాథ్ పాండే ఈ విషయాన్ని చెప్పారు. షాంఘై సహకార సంస్థ పరిశ్రమల మంత్రుల 2వ సమావేశం ఉజ్బెకిస్తాన్‌లో ఈ రోజు ఉజ్బెకిస్తాన్ ఆతిథ్య దేశంగా జరిగింది. షాంఘై సహకార సంస్థ లో చైనా, కజకిస్తాన్, కిర్గిజిస్థాన్, రష్యా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇండియా ఉ పాకిస్థాన్ పూర్తికాల సభ్య దేశాలుగా ఉన్నాయి. సంస్థలో భారతదేశం చురుకైన, సానుకూల నిర్మాణాత్మక పాత్రను కొనసాగిస్తుందని మంత్రి ప్రత్యేకంగా చెప్పారు. పరస్పర ప్రయోజనకరమైన అవకాశాలను అన్వేషించడానికి షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల పారిశ్రామికవేత్తలతో సహకరించడానికి భారతదేశం నిబద్ధతను కూడా ఆయన పునరుద్ఘాటించారు. పరస్పర సహకారంతో కలిసి నడవడం ద్వారా ఈ ప్రాంతంలో సామాజిక-ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. షాంఘై సహకార సంస్థ ప్రాంతం అభివృద్ధి చెందాలనే కోరిక కారణంగానే, భారతదేశం 'షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల వ్యాపార ప్రపంచాల మధ్య పారిశ్రామిక సహకారాన్ని ప్రోత్సహించడానికి ముసాయిదా కార్యక్రమం, ప్రదర్శన కార్యక్రమాల నిర్వహణ కోసం నిబంధనలను' సిద్ధం చేసిందని ఆయన అన్నారు. షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల పరిశ్రమ మంత్రుల సెషన్ కూడా ఉంటుందని అన్నారు. భారతదేశం లో బలమైన పారిశ్రామిక వాతావరణం ఉందని డాక్టర్ పాండే ఉద్ఘాటించారు. కొవిడ్ 19 మహమ్మారి కారణంగా అంతరాయాలు ఉన్నప్పటికీ, 2021?-22లో దాని పనితీరు గణనీయంగా మెరుగుపడిందని పునరుద్ఘాటించారు. భారతదేశ జిడిపిలో మైనింగ్ ఉ క్వారీయింగ్, తయారీ ఉ నిర్మాణాల వాటా ఇప్పుడు 28% అని ఆయన చెప్పారు. తమ ప్రధానమంత్రి స్ఫూర్తిదాయక నాయకత్వంలో ప్రభుత్వం పారిశ్రామిక పునరుజ్జీవనం కోసం సమగ్రమైన కార్యక్రమాన్ని రూపొందించిందని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సరిగా లేకపోవడం ఉ నిదానంగా ఉన్న వ్యాపార ప్రక్రియల కారణంగా తలెత్తుతున్న దీర్ఘకాలిక అడ్డంకులను తొలగించడం కోసం ప్రభుత్వం ఒక సమగ్ర కార్యక్రమాన్ని రూపొందించిందని ఆయన చెప్పారు. దేశంలో పారిశ్రామిక వాతావరణాన్ని మెరుగుపరచడానికి వివిధ కార్మిక మార్కెట్ సంస్కరణలను కూడా ప్రవేశపెట్టినట్లు ఆయన వివరించారు.

# అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్'..పోస్టర్ విడుదల చేసిన అమల అక్కినేని




హైదరాబాద్, జులై 16:క్యాన్సర్ రోగులకు సహాయాన్ని అందించడంలో విశేష కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ..అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్'ను ఫిజికల్, వర్చువల్‌గా నిర్వహిస్తున్నది. జూబ్లీ హిల్స్‌లోని హోటల్ దసపల్లాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటి, జంతు సంరక్షణ కార్యకర్త అమల అక్కినేని ముఖ్య అతిథిగా హాజరై గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2022 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న రన్నర్లను ఈ రన్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. భయంకరమైన క్యాన్సర్ వ్యాధికి వ్యతిరేకంగా పోరాటంలో రన్నర్లు భాగస్వాములు చేస్తున్నారు. క్యాన్సర్‌పై అవగాహన, నివారణ, ముందస్తుగా వ్యాధిని గుర్తించడంలో రన్నర్లు తమ స్ఫూర్తిని అందిచాలనే ఒక గొప్ప సదుద్దేశంతో 'రన్ ది ఎక్స్‌ట్రా మైల్ టు గిఫ్ట్ ఏ స్మైల్' అనే నేపథ్యంతో ఈ రన్‌ను నిర్వహిస్తున్నారు.

5 కి.మీ. 10 కి.మీ., 21.1కి.మీ. (హాఫ్ మారథాన్) మూడు విభిన్న దూర విభాగాల్లో ఫిజికల్, వర్చువల్ అనే హైబ్రిడ్ పద్ధతిలో రన్ నిర్వహిస్తారు. ఫిజికల్ రన్ హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, వైజాగ్, గుంటూరు, నిజామాబాద్, దావణగెరెతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న మరో 130 దేశాల్లోని నగరాల్లో జరుగుతుంది. వర్చువల్ రన్‌లో ప్రపంచంలోని ఏ ప్రాంతం నుంచైనా ఈ రన్‌లో పాల్గొనవచ్చు. రన్నర్లు ఉదయం 5.00 -9.00 గంటల మధ్య పరిగెత్తాల్సి ఉంటుంది. ఆసక్తిగల ఔత్సాహికులు ప్రపంచవ్యాప్తంగా వారి సంబంధిత టైమ్ జోన్‌లలో రన్ వివరాలను యాక్సెస్ చేయవచ్చు. https://gracecancerrun 2022.iq301.com/లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 9959154371 / 9963980259 నంబర్లలో సంప్రదించాలి.

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గౌరవ అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి, రిటైర్డ్ ఐపీఎస్ సుజాత రావు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ప్రమీలారాణి, గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2022 రేస్ డైరెక్టర్ నిరంజన్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి..!

**-పూర్తయిన ఇండ్లు ప్రారంభానికి సిద్ధం చేయాలి.**
**-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ .**

సంగారెడ్డి, జూలై 16 (నేటి నిజం ప్రతినిధి) డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పూర్తయిన ఇండ్లు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలకు ఆదేశించారు.

కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో హౌసింగ్ నోడల్ అధికారి, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ లతో రెండు పడక గదుల నిర్మాణాల పనుల పురోగతి, మౌళిక సౌకర్యాల ఏర్పాటు, సైట్ వారీగా పూర్తయిన ఇండ్లు, వివిధ దశలో ఉన్నవి, మౌళిక వసతులు కల్పించాల్సినవి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇండ్లు తదితర అంశాలను సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తయిన ఇండ్లను ఆగస్ట్ మొదటి వారంలో ప్రారంభించడానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా వివిధ దశల్లో ఉన్న ఇండ్ల పనులను నెల లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ఇండ్లన్నూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ఆయా సైట్లలో చేపట్టిన నిర్మాణాలు, పూర్తి అయినవి , పూర్తి అయిన ఇండ్లలో మౌళిక సౌకర్యాల కల్పన వివరాలు సమర్పించాలని, కొనసాగుతున్న పనులు ఏ దశలో ఉన్నాయన్న వివరాల నివేదికను స్పష్టంగా అందజేయాలని హౌసింగ్ నోడల్ అధికారికి సూచించారు.



పనుల వేగవంతానికి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల తో కోఆర్డినేషన్ చేసుకోవాలని సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలన్నారు. పెండింగ్ పనులకు సంబంధించి స్టేజి వారీగా పనుల నివేదిక ఇవ్వాలని ఏజెన్సీ లకు ఆదేశించారు.

లబ్ధిదారులకు అందించడానికి వివిధ దశల్లో ఉన్న ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలకు ఆదేశించారు.

లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయాలని, పూర్తయిన ఇండ్లను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని హౌసింగ్ నోడల్ అధికారి మరియు డి సి ఓ తుమ్మ ప్రసాద్ కు సూచించారు.

ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, హౌసింగ్ నోడల్ అధికారి తుమ్మ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు ఆర్ అండ్ ఈ ఈ సురేష్, పంచాయతీరాజ్ ఈ ఈ జగదీశ్వర్, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ఎన్నికల్లో యశ్వంత్‌కే తమ సపోర్ట్.. వెల్లడించిన ఆమ్ ఆద్మీ పార్టీ

న్యూఢిల్లీ, జులై 16: రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకే తమ మద్దతు ఉంటుందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ శనివారం తెలిపారు. పార్టీ రాజకీయ సలహా కమిటీ (పీఏసీ) భేటీ తర్వాత ఈ విషయాన్ని ఆయన మీడియాకు వెల్లడించారు. బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎంపిక చేసిన అభ్యర్థి ద్రౌపది ముర్ముతో దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవికి సిన్హా పోటీలో ఉన్నారు.

తాము ఓ గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును తప్పకుండా గౌరవిస్తామని, కానీ, ప్రతిపక్ష అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు తమ మద్దతు ఉంటుందని సింగ్ చెప్పారు. ఈ సమావేశానికి ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, పంజాబ్ ఎంపీ రాఘవ్ చద్దా, ఎమ్మెల్యే అతిషి, ఇతర పీఏసీ సభ్యులు హాజరయ్యారు.

కాగా, రాష్ట్రపతి ఎన్నికకు సోమవారం ఓటింగ్ జరగనుంది. ఢిల్లీ, పంజాబ్ రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలను కలిగి ఉన్న ఏకైక బీజేపీయేతర, కాంగ్రెసేతర పార్టీగా ఆమ్?ఆద్మీ పార్టీ ఉంది. ఇందులో ఢిల్లీ నుంచి ముగ్గురు సహా రెండు రాష్ట్రాల నుంచి 10 మంది రాజ్యసభ ఎంపీలున్నారు. అలాగే పార్టీకి పంజాబ్‌లో 92, ఢిల్లీలో 62, గోవాలో ఇద్దరు సహా మొత్తం 156 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

# కౌలు రైతు శంకరం కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష అందజేసిన పవన్ కల్యాణ్

అమరావతి, జులై 16: జనసేన కౌలు రైతు భరోసా యాత్ర తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రారంభమైంది. సాగు కలిసి రాక ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలు రైతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు జనసేన ఈ యాత్రని చేపట్టింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం చేరుకుని నగరం నుంచే ఈ యాత్రని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవలే ఆత్మహత్యకు పాల్పడ్డ కౌలు రైతు పచ్చిమళ్ళ శంకరం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. శంకరం ఫొటోకు నివాళి అర్పించిన పవన్? ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం జనసేన కౌలు రైతు భరోసా యాత్రలో ప్రకటించిన రూ.1 లక్షను ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

# గంగమ్మకు మంత్రి పువ్వాడ నది హారతి-పూజలు





భద్రాద్రి కొత్తగూడెం జులై 16 (నేటి నిజం ప్రతినిధి) :భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం గోదావరి నది వద్ద వరద ఉధృతిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరిశీలించారు.

ఎగువ నుండి గోదావరికి భారీగా వరద నీరు రావడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, రాగల 24గంటల్లో ప్రవాహం తగ్గి నిలకడగా మారుతుందని అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, నది హారతినీ ఇచ్చారు.

సీసీఎల్ఏ డైరెక్టర్ రజత్ కుమార్ షైనీ, సింగరేణి సీఎండీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ అనుదీప్, ఎస్పి వినీత్, తదితరులు ఉన్నారు.

# బుల్లెట్ రైలుకు పచ్చజెండా.. మహారాష్ట్ర - అహ్మదాబాద్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ, జులై 16: ముంబై- అహ్మదాబాద్ మధ్య ప్రధాని నరేంద్ర మోడీ కలల ప్రాజెక్టు, ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు అయిన బుల్లెట్ రైలుకు మహారాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని అనుమతులను ఇచ్చింది. మహారాష్ట్ర ప్రభుత్వం మార డంతో ఇప్పుడు పలు ప్రాజెక్టులు స్పీడ్‌గా కదులుతు న్నాయి. మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల్లో బుల్లెట్ రైలు ఒకటి. జూన్ 30న షిండే, ఫడ్నవీస్‌లు ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మొదటి క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతంగా చేయాలని నిర్ణయించింది. గత మహావికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం ప్రాజెక్టు పనులను ప్రారంభిం చడం ఆలస్యం చేసిందని, ఫైల్స్‌ను టేబుల్‌పై పెట్టుకుని కూర్చుందని బీజేపీ ఆరోపిస్తోంది. ప్రభుత్వం మార్పుతో పాటు కొత్త ప్రభుత్వంతో ఇప్పుడు ప్రాజెక్టుకు ఊతం లభిస్తుందని రైల్వేమంత్రి భావిస్తున్నారు. ఈ రైలు మహారాష్ట్ర, గుజరాత్‌లోని 12 స్టేషన్లు-సూరత్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి, బిలిమోరా, బరూచ్, ముంబై, థానే, విరార్, బోయినర్, వాపి స్టేషన్లగుండా నడుస్తుంది. కేవలం రెండు గంటల్లో దూరాన్ని చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు భారతదేశంలోనే మొదటిది.

## 2026 నాటికి బుల్లెట్ రైతులు..

2026 నాటికి సూరత్, బిల్మోరా స్టేషన్ల మధ్య మొదటి బుల్లెట్ రైలు ప్రాంభమవుతుందని ఆశిస్తున్నట్లు రైల్వే మంత్రి ఒక కార్యక్రమంలో చెప్పారు. ముంబై అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లోని 8 స్టేషన్లలో బుల్లెట్ రైలు పనులు పురోగతిలో ఉన్నాయి. 70 కి.మీ మార్గంలో పిల్లర్లు సిద్ధం చేశామన్నారు. అదే సమయంలో అహ్మదాబాద్ నుండి వాపి మధ్య 160 కి.మీ మార్గంలో పునాది పనులు జరిగాయి. మార్గం మధ్యలో వచ్చే ఎనిమిది నదులపై వంతెనల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టుపై ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం ఉత్సాహం చూపలే దన్నారు. అయితే ఇప్పుడు గుజరాత్ లాగా మహారా ష్ట్రలో కూడా పనులు వేగవంతం అవుతాయని ఫడ్నవీస్ తెలిపారు.

ప్రతిష్టాత్మకమైన అహ్మదాబాద్-ముంబై బుల్లెట్ రైలు గరిష్టంగా గంటకు 350 కి.మీ డిజైన్ వేగంతో, గరిష్టంగా గంటకు 320 కి.మీ ఆపరేటింగ్ స్పీడ్‌ని కలిగి ఉంటుంది. దాదాపు 5 సంవత్సరాల క్రితం సెప్టెంబర్ 2017లో అహ్మదాబాద్‌లోని సబర్మతి వద్ద రూ. 1.1 లక్షల కోట్ల ప్రాజెక్టుకు జపాన్ ప్రధాని షింజో అబేతో కలిసి ప్రధాని నరేంద్రమోడీ శంకుస్థాపన చేశారు.

## నిర్ణయం కాని ఛార్జీలు.

బుల్లెట్ రైలు ఛార్జీలను ఫస్ట్ క్లాసు ఏసీ రైలుతో సమానంగా ఉంచుతామని గత నెలలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సూచించారు. అయితే చార్జీలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, అయితే చెల్లించే దానికంటే తక్కువ ధర ఉంటుందని, సౌకర్యాలు బాగుంటాయని వైష్ణవ్ తెలిపారు. చివరగా ప్రాజెక్టు పూర్తయిన తర్వాత అసలు ఛార్జీలు నిర్ణయిస్తామని ఆయన స్పష్టంచేశారు.

